స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 158 | మంగళవారం, అక్టోబర్ 27, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసాచారి | పేజీలు: 12 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 158 | TUESDAY, OCTOBAR 27, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 12 | RS : 5-00 |


## చిల్లర వివాదం..

- కండక్టర్‌కు తీవ్ర గాయాలు
- మణుగూరు వద్ద నడుస్తున్న బస్సులో ఘటన
- టికెట్ చిల్లర విషయంలో ప్రయాణికురాలితో వాగ్వాదం
- బస్సులో నుంచి కిందపడిన కండక్టర్ ప్రవళిక
- వెనుక చక్రం కింద పడి రెండు కాళ్లకు గాయాలు

2

# '148 మీటర్ల'పై పునఃసమీక్షకు సిద్ధమే

- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం తదితరాలపై పరిశీలించేందుకు కమిటీ వేద్దాం
- వాస్తవాలు, అంచనాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుందాం
- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ స్పష్టీకరణ
- తెలంగాణకు సహకరించేందుకు అభ్యంతరం లేదని వెల్లడి
- ముంబైలో ఇరు రాష్ట్రాల సీఎంల చర్చలు మహారాష్ట్ర, తెలంగాణలకు వారధిగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ
- ఎత్తును 152 మీటర్లకు పెంచేందుకు సమ్మతించండి: సీఎం రేవంత్



**హైదరాబాద్, అక్టోబరు 26 (వార్త వేదిక సూర్య ప్రతినిధి):**

తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కట్టడానికి తెలంగాణ చేసిన విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారు. తమ రాష్ట్ర ప్రజలపై ప్రతికూల ప్రభావం పడకపోతే 148 మీటర్ల ఎత్తుకు అంగీకరిస్తూ గతంలో చేసుకున్న ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై తెలంగాణ ప్రతిపాదన పట్ల గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరిని కనబరిచిందని గుర్తు చేశారు. బ్యారేజీ ఎత్తుపై ఇప్పుడు తెలంగాణ విజ్ఞప్తిని పరిశీలించేందుకు తాము స్వతంత్రంగా అధ్యయనం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. బ్యారేజీ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణం తదితరాలను ఈ అధ్యయనంలో పరిశీలిస్తారని, దానిలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు కలిసి, చర్చించి, పరిశీలిస్తారని వివరించారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుందామని, వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుందామని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కట్టడానికి అనుమతులకు సంబంధించి మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం చర్చించింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు, ప్రయోజనాలు తదితర అంశాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిగతా 2లో..



## మహిళలకు డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి అవకాశాలు

- మందమర్రిలో డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాట్ల పరిశీలన
- సమ్మక్క సారలమ్మ మహిళా భవన్‌లో శిక్షణకు సన్నాహాలు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వ ప్రోత్సాహం
- శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**మందమర్రి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య ప్రతినిధి):**

మహిళలకు డ్రైవింగ్ శిక్షణ అందించి, వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని సమ్మక్క సారలమ్మ మహిళా భవన్‌లో మహిళలకు డ్రైవింగ్ శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిక్షణా మార్గాన్ని ఆయన సందర్శించారు. మోవో సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఏర్పాట్లను పరిశీలించి, శిక్షణకు అవసరమైన సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. మహిళలు వాహనాలు నడపడంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఇటు వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని మంత్రి వివరించారు. డ్రైవింగ్ శిక్షణ ద్వారా మహిళలు వాహనాలను నడపడంలో ప్రావీణ్యం సంపాదించడంతోపాటు ఉపాధి అవకాశాలను కూడా పెంచుకోవచ్చని తెలిపారు. రవాణా రంగంలో మహిళలకు అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకునేలా మిగతా 2లో..



## అర్ణాబ్‌తో ముప్పు

- తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్ వార్నింగ్
- అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- రేపటికి అతి తీవ్ర తుపానుగా బలపడే సూచనలు
- ఈ నెల 28న తీరం దాటే అవకాశం

**విశాఖపట్నం, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్ణాబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల వైపు వేగంగా కదులుతుండటంతో తీర ప్రాంతాల్లో అప్రమత్తత పెరిగింది. తుపాను కదలికలను ఉపగ్రహ చిత్రాల ద్వారా పరిశీలిస్తున్నట్లు సమాచారం. తుపాను వ్యవస్థీకృతంగా బలపడుతూ దట్టమైన మేఘాలతో విస్తరిస్తున్న నేపథ్యంలో సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. తుపాను తీవ్రత, గాలి వేగం, వర్షపాతం వంటి అంశాలపై వాతావరణ శాఖ అధికారులు నిరంతరం పరిశీలన జరుపుతున్నారు. తీర ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 26వ తేదీ అర్ధరాత్రి నాటికి ఈ మిగతా 2లో..



## ఆర్ణాబ్ తుఫాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

- తుపాను గమనాన్ని నిరంతరం అంచనా వేయాలని ఆదేశం
- వర్షాలు, గాలులు, వరదల తీవ్రతపై అప్రమత్తత
- ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచన

2



## పార్లమెంట్ నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

- భవనం వెనుకవైపు దట్టమైన పొగలు
- ఆరు అగ్నిమాపక వాహనాలతో మంటల అదుపు
- వెల్డింగ్ పనుల సమయంలో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం
- ఎలాంటి ప్రాణనష్టం లేదన్న అధికారులు

2 లో..

## తుమ్మిడిహెట్టిపై కాలయాపన

- 1,054 రోజులైనా ముందుకు సాగని చర్చలు
- ప్రాజెక్టు సమగ్ర నివేదికను బయటపెట్టాలని డిమాండ్
- నీటి లభ్యత, ఆయకట్టుపై స్పష్టత ఏదని ప్రశ్న
- కాళేశ్వరం మరమ్మతులు చేపట్టాలని సూచన



**హైదరాబాద్, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య ప్రతినిధి):**

తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నాయకుడు హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. మహారాష్ట్రతో చర్చలు ప్రారంభించడానికి తమ ప్రభుత్వానికి 42 రోజులు పట్టిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి 1,054 రోజులు గడిచినా ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆరోపించారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే ఇప్పటివరకు జరిగిన చర్చలు, ప్రాజెక్టు ప్రణాళిక, నీటి లభ్యతకు సంబంధించిన వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రకటనలు చేయడం కాకుండా, దాని సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. తమ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు 2014 జూలై 23న మహారాష్ట్రతో చర్చలు ప్రారంభించామని హరీశ్‌రావు గుర్తుచేశారు. మొదటి ఆరు నెలల్లోనే ఆరుసార్లకు పైగా చర్చలు జరిపామని తెలిపారు. కేసీఆర్ తన పుట్టినరోజున సైతం మహారాష్ట్రకు వెళ్లి ప్రాజెక్టు నిర్మాణానికి 152 మీటర్ల ఎత్తు ఆమోదం పొందేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. 2007లో ప్రారంభమైన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ఏడేళ్ల పాలనలో ఎందుకు ముందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. అప్పట్లో కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా మిగతా 2లో..

## పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల తుది బిల్లుల చెల్లింపు

- లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ
- నేలకొండపల్లిలో రెండో విడత మంజూరు పత్రాల పంపిణీ
- అనాసాగరం–పమ్మి రహదారికి రూ.2.80 కోట్లతో శంకుస్థాపన
- రెండో పంట వేయవద్దని రైతులకు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

2 లో..



**నేలకొండపల్లి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య ప్రతినిధి):**

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న తుది బిల్లులన్నింటినీ రాబోయే పది రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే బా ధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి తెలిపారు. ఎలాంటి లంచాలకు తావు లేకుం డా బిల్లుల చెల్లింపులు చేపడతామని స్పష్టం చేశారు. నేలకొండపల్లి రైతు వేదికలో నిర్వహించిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండలంలోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన పేదలకు ఇళ్లు అందించడంతో పాటు, ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి పెండింగ్ బిల్లులు చెల్లించేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపా రు. నేలకొండపల్లి మండలంలో మొదటి విడత కింద 648 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వాటిలో సుమారు 620 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. వివిధ కారణాలతో ఇంకా పూర్తికాని ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండో విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను కూ డా నిబంధనల ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్ర యోజనాలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బిల్లుల చెల్లింపుల్లో జా ప్యం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎల్నినో ప్ర భావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో పాటు విద్యుత్, నీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి సూచించారు. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట సాగు చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. వర్షాలు, నీటి మిగతా 2లో..



## రాష్ట్ర హైకోర్టుకు కొత్త చీఫ్ జస్టిస్

- పేరును సిఫారసు చేసిన కొలీజియం
- ఢిల్లీ హైకోర్టు సీజేగా తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శాంకోషీ
- నలుగురు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి

2 లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 158
మంగళవారం
27 అక్టోబర్, 2026

## రాష్ట్ర హైకోర్టుకు కొత్త చీఫ్ జస్టిస్

హైదరాబాద్, అక్టోబరు 26 (వార్త వేదిక సూర్య):

రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తి రానున్నారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ (సీజే)గా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సోమవారం జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (యాక్టింగ్ సీజే)గా వ్యవహరిస్తున్న జస్టిస్ శాంకో షీని ఢిల్లీ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫారసు చేసింది. గుజరాత్ హైకోర్టులో న్యాయ మూర్తిగా ఉన్న జస్టిస్ మానశ్ రంజన్ పాఠక్‌ను అదే హైకోర్టు సీజేగా, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌సింగ్‌ను ఉత్తారఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని తీర్మానించింది. మొత్తంగా నలుగురు హైకోర్టు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి కల్పిస్తూ కొలీజియం సిఫారసులు చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం వీరు పదవీబాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ ఈ నెల మొదట్లో పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లారు. దీంతో హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ శాంకోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. కొలీజియం తాజా సిఫారసుతో త్వరలో పూర్తిస్థాయి సీజే రానున్నారు.

## పార్లమెంటు నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంటు సమీపంలోని నార్త్ బ్లాక్ భవనంలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. భవనం వెనుకవైపు నుంచి దట్టమైన నల్లటి పొగలు వెలువడటంతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. ఉదయం 11.10 గంటల సమయంలో నార్త్ బ్లాక్ నుంచి పొగలు వస్తున్నట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు ఆరు అగ్నిమాపక వాహనాలను ఘటనాస్థలికి పంపించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. నార్త్ బ్లాక్ భవనంలో ప్రస్తుతం మరమ్మతులతో పాటు ఇతర పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో భవనం పైకప్పుపై కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. అక్కడ ఏర్పాటు చేసిన ఏసీ బాయిలర్ వద్ద మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. భవనంలో జరుగుతున్న పనుల సమయంలో మంటలు ఎలా వ్యాపించాయనే అంశంపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ, మంటలు మరింత విస్తరించకుండా సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. వెల్డింగ్ పనుల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఏసీ బాయిలర్ వద్ద మంటలు ఎలా ప్రారంభమయ్యాయి, వెల్డింగ్ పనులకు సంబంధించిన పరిస్థితులు ప్రమాదానికి దారితీశాయా అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రాథమిక అంచనాల ఆధారంగా కారణాన్ని నిర్ధారించకుండా, సంబంధిత అధికారులు మరిన్ని వివరాలను పరిశీలిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కొద్దిసేపటికే మంటలు పూర్తిగా ఆర్పివేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపారు. అగ్నిప్రమాదం ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా సిబ్బంది చర్యలు తీసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో ఉన్నవారికి సంబంధించి అదనపు వివరాలు మాత్రం వెల్లడికాలేదు. అగ్నిప్రమాదం నేపథ్యంలో నార్త్ బ్లాక్ భవనానికి ఎంతమేర నష్టం వాటిల్లిందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలు చెలరేగడానికి దారితీసిన పరిస్థితులు, వెల్డింగ్ పనుల నిర్వహణలో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే వివరాలు అధికారుల పరిశీలన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. పార్లమెంటు సమీపంలోని కీలక భవనంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించి మంటలను అదుపు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ‘148 మీటర్ల’పై పునఃసమీక్షకు సిద్ధమే

(మొదటి పేజీ తరువాయి)



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా, తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని వెల్లడించారు. అయితే, తుది నిర్ణయానికి రావడానికి ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ''సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలి. మహారాష్ట్ర, తమ ప్రజలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు అభ్యంతరం లేదు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకూ ఎలాంటి అభ్యంతరం లేదు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం'' అని వివరించారు. స్నేహ, సోదర భావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర గతంలో పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తు చేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల వనరుల సంఘం అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈలోపు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖల ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడణవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని నిర్దేశించారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. గతంలో అనుమతి ఇచ్చిన తర్వాత ముంపు ప్రాంతం మరింత ఎక్కువగా ఉందని గుర్తించామని, అందుకే, ఈసారి సమగ్ర అధ్యయనం తప్పనిసరి అని చెప్పారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని, తదుపరి సమావేశాల నిర్వహణ, కాల పరిమితులను నిర్ణయించాలని సూచించారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

### ఇరు రాష్ట్రాలకూ వారధి ఇది: సీఎం రేవంత్

''తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు. రెండు రాష్ట్రాలనూ భౌతికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుంది. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుంది. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతోపాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడంలో ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ– మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలూ కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాలపరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో గ్రామాలు ముంపునకు గురికావని, రెండు రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందనే అంశాలపై అధ్యయనం చేయడానికి ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేద్దామని మహారాష్ట్ర సీఎం ప్రతిపాదించగా తెలంగాణ ప్రతినిధి బృందం అంగీకరించింది. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం, తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్‌ను ఖరారు చేసింది.

### మహారాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం: ఉత్తమ్

మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

# పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల తుది బిల్లుల చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)



లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతకుముందు నేలకొండపల్లి మండలంలోని అనాసాగరం నుంచి పమ్మి వరకు రెండున్నర కిలోమీటర్ల మేర నిర్మించనున్న తారు రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.2.80 కోట్ల అంచనా వ్యయాన్ని కేటాయించారు. అనంతరం పాలేరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కుసుమంచి మండలం గోరిల్లపాడు తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ భూక్యా శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎంపీడీవో ఎర్రయ్య, తహశీల్దార్ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీతో పాటు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభం కార్యక్రమాలు నిర్వహించారు.

# ‘అర్నాబ్’తో ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

తుపాను తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని, అక్టోబర్ 27వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా బలపడే ప్రమాదం ఉందని సమాచారం. తుపాను కదలికల్లో మార్పులను బట్టి దాని తీవ్రతలోనూ మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే గాలుల వేగం మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండటంతోపాటు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం తుపాను తూర్పు మధ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్నట్లు సమాచారం. ఇది విశాఖపట్నానికి ఆగ్నేయంగా సుమారు 650 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. తొలుత పశ్చిమ వాయవ్య దిశగా కదిలి, అనంతరం వాయువ్య దిశగా ప్రయాణిస్తూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తుపాను దిశ, వేగాన్ని బట్టి తీర ప్రాంతాల్లో వర్షాల తీవ్రత మారవచ్చు. ముఖ్యంగా సముద్ర తీరానికి సమీపంలోని గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అక్టోబర్ 28వ తేదీ ఉదయం సమయంలో బాపట్ల, విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం ఉందని సమాచారం. తీరం దాటే సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, కొన్ని సందర్భాల్లో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలవడం, చెట్లు విరిగిపడటం, విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది. తీర ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే తాగునీరు, ఆహార పదార్థాలు, మందులు, విద్యుత్తు లేని సమయంలో ఉపయోగించే దీపాలను సిద్ధంగా ఉంచుకోవాలి. అధికారులు సూచించినప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి. తెగిపడిన విద్యుత్తు తీగలను తాకకూడదు, ఉప్పొంగే వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించకూడదు.

## తుఫాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):

అర్నబ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావం ఉండే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, తుపాను కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తుపాను గమనం, దాని ప్రభావంపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులను నిర్లక్ష్యం చేయకుండా, అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, వరద ప్రవాహాల తీవ్రతను అంచనా వేస్తూ తగిన చర్యలు చేపట్టాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించి, వాటికి అనుగుణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుపాను ప్రభావాన్ని నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలను ఆలస్యం చేయకుండా చేపట్టాలని స్పష్టం చేశారు. పరిస్థితుల తీవ్రతను బట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందించడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొనసాగించడం ముఖ్యమని అధికారులకు తెలిపారు.

## మహిళలకు డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మందమర్రిలోని సమ్మక్క సారలమ్మ మహిళా భవన్‌లో ఏర్పాటు చేస్తున్న డ్రైవింగ్ శిక్షణా మార్గం మహిళలకు అనుకూలంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. శిక్షణలో భాగంగా వాహనాల నిర్వహణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్‌లో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం ప్రాధాన్యం సంతరించుకోనుంది. మహిళలు ప్రాథమిక నైపుణ్యాల నుంచి వాహనాన్ని సురక్షితంగా నడిపే స్థాయి వరకు శిక్షణ పొందేందుకు తగిన సదుపాయాలు కల్పించాలని సంబంధిత సంస్థకు సూచించారు. శిక్షణా కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు నైపుణ్యాభి వృద్ధి కార్యక్రమాలు కీలకమని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో మహిళలకు కొత్త నైపుణ్యాలను నేర్పించడం ద్వారా వారు స్వతంత్రంగా ఆదాయం సంపాదించేందుకు మార్గాలు ఏర్పడతాయని తెలిపారు. డ్రైవింగ్ శిక్షణ పొందిన మహిళలు వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొందడంతోపాటు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయవచ్చని వివరించారు. మహిళలు తమ సామర్థ్యాలను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. మందమర్రిలో ఏర్పాటు చేస్తున్న డ్రైవింగ్ శిక్షణా కేంద్రం ద్వారా స్థానిక మహిళలకు ప్రయోజనం కలగాలని ఆకాంక్షించారు. శిక్షణకు వచ్చే మహిళలకు అవసరమైన సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, నాణ్యమైన బోధన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

## తుమ్మిడిహట్టిపై కాలయాపన

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు విషయంలో కాలయాపన చేస్తోందని విమర్శించారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై స్పష్టత లేకుండానే ప్రాజెక్టు గురించి ప్రకటనలు చేయడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. 152 మీటర్ల ఎత్తులో నీరు అందుబాటులో ఉండదని కేంద్ర జల సంఘం మూడు లేఖల్లో స్పష్టం చేసిందని, ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సూచించిందని పేర్కొన్నారు. తమ్మిడిహట్టి వద్ద 160 టీఎంసీల నీరు అందుబాటులో లేదని కేంద్ర సంస్థలు తెలిపిన తర్వాతే మేడిగడ్డను ఎంపిక చేయాల్సి వచ్చిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 240 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా తమ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. తమ్మిడిహట్టి నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అయితే నీరు ఎక్కడి నుంచి తీసుకొస్తారు, ఎంత ఆయకట్టుకు సాగునీరు అందిస్తారు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఎక్కడ ఉందనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్లకు రూ.25 వేల కోట్లతో నీటిని తరలించే ప్రణాళికపై హరీశ్‌రావు ప్రశ్నలు లేవనెత్తారు. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి గురుత్వాకర్షణ శక్తితోనే నీటిని తీసుకువస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారని ప్రస్తావిస్తూ, ఆ వాదనను నిరూపించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ అంశంపై తాను రాజీనామాకు సిద్ధమని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా సిద్ధమా అని ప్రశ్నించారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని డిమాండ్ చేశారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని నివేదిక చెబుతున్నప్పటికీ మరమ్మతులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంపుహౌస్‌ను నడపకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో వ్యవహరిస్తూ తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. చెన్నూరు ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తమ ప్రణాళిక అని, వార్ధా ప్రాజెక్టు సమగ్ర నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెనక్కి పంపిందని ఆరోపించారు. అన్నీ కొనగలమని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు అవసరమైన నీటిని ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. నీటిని కొనలేమంటూనే నీటిని అందించే ప్రాజెక్టులను కూడా నడపడం లేదని విమర్శించారు. కాళేశ్వరం తెలంగాణకు వరమని, రాష్ట్రాన్ని కరువు నుంచి కాపాడగల ప్రాజెక్టు అని పేర్కొంటూ, ప్రస్తుత పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా అభివర్ణించారు.

## చిల్లర వివాదం.. కండక్టర్‌కు తీవ్ర గాయాలు

మణుగూరు వద్ద నడుస్తున్న బస్సులో ఘటన
టికెట్ చిల్లర విషయంలో ప్రయాణికురాలితో వాగ్వాదం
బస్సులో నుంచి కిందపడిన కండక్టర్ ప్రవళిక
వెనుక చక్రం కింద పడి రెండు కాళ్లకు గాయాలు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు సమీపంలో బస్సులో చిల్లర విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘటనకు దారితీసింది. ప్రయాణికురాలికి టికెట్ ఇచ్చిన సమయంలో చిల్లర అందుబాటులో లేకపోవడంతో ప్రారంభమైన వాగ్వాదం కండక్టర్ ప్రవళికకు తీవ్ర గాయాలయ్యే పరిస్థితికి దారితీసినట్లు సమాచారం. మౌనిక అనే మహిళ తన కుమారుడి టికెట్ కోసం కండక్టర్‌కు రూ.100 నోటు ఇచ్చినట్లు తెలిసింది. రూ.10 విలువైన టికెట్ ఇచ్చిన కండక్టర్ వద్ద మిగిలిన మొత్తానికి చిల్లర లేకపోవడంతో టికెట్ వెనుక చిల్లర వివరాలు రాసి ఇచ్చారు. అయితే వెంటనే చిల్లర కావాలంటూ ప్రయాణికురాలు పట్టుబట్టడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. వాగ్వాదం తీవ్రం కావడంతో నడుస్తున్న బస్సులోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రయాణికురాలు కండక్టర్ ప్రవళికను బస్సులో నుంచి కిందకు నెట్టివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రవళిక రహదారిపై పడిపోయి బస్సు వెనుక చక్రం కిందకు వెళ్లినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

## నీటి వృథాపై జలమండలి చర్యలు

ప్యారడైజ్ హోటల్‌కు రూ.20 వేల జరిమానా
తనిఖీల్లో నీటి దుర్వినియోగం గుర్తింపు

హైదరాబాద్, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):

తాగునీటిని దుర్వినియోగం చేసినందుకు సికింద్రాబాద్‌లోని ప్రముఖ హోటల్ ప్యారడైజ్ యాజమాన్యానికి జలమండలి రూ.20 వేల జరిమానా విధించింది. నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు చేపడుతున్న తనిఖీల్లో భాగంగా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 16వ డివిజన్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో హోటల్‌లో నీటి దుర్వినియోగాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానా విధించినట్లు సమాచారం. జలమండలి అధికారులు హోటల్ ప్యారడైజ్‌లో తనిఖీలు నిర్వహించిన సమయంలో నీటి వినియోగానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. హోటల్‌కు సంబంధించిన వినియోగదారుల ఖాతా సంఖ్య 612182839గా గుర్తించారు. తనిఖీల్లో తాగునీటి దుర్వినియోగం జరిగినట్లు గుర్తించడంతో యాజమాన్యంపై రూ.20 వేల జరిమానా విధించారు. నగరంలో తాగునీటి సరఫరాను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరాన్ని ఈ చర్య మరోసారి స్పష్టం చేసింది. తాగునీరు ప్రజలందరికీ అవసరమైన వనరు కావడంతో దానిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని జలమండలి అధికారులు సూచించారు. గృహాలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అవసరానికి మించి నీటిని వినియోగించడం, దుర్వినియోగానికి పాల్పడటం వల్ల నీటి వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు.



# యాదాద్రి భువనగిరి

యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన

## జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

**పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ (జీడీ) పుస్తకం, వివిధ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించడంతో పాటు, అనుమానిత వ్యక్తుల షీట్లు, రౌడీ షీట్లను తనిఖీ చేశారు. నేర నియంత్రణకు సంబంధించి పోలీసుల నిఘాను మరింత పటిష్టం చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, పోలీస్ స్టేషన్ పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతను పాటిస్తూ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస్ నాయుడు, సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై ముద్దాపురం లో గ్రామసభ



**వలిగొండ :అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కిరణ్ పంచాయతీ కార్యదర్శి మత్స్యగిరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. గ్రామంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం వ్యవసాయ రంగానికి అవసరమైన నీటిని పొదుపుగా వినియోగించుకోవడం,రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు నీటి సంరక్షణకు ఉపయోగపడే పనులను గుర్తించి చేపట్టాలని అన్నారు.గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటినుంచే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి, ఉపసర్పంచ్ బడక శ్రీను, వార్డ్ సభ్యులు బత్తుల బిక్షపతి, గూడూరు సుగుణ, శ్యామల చైతన్య, అంగన్వాడి టీచర్ పి సునీత, ఆశ కార్యకర్త గుంటోజు రామలీల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ ప్లస్ డేస్ ధర్నాను జయప్రదం చేయండి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ**



**భువనగిరి టౌన్ అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య)**

భువనగిరి నుండి సిఐటియు ఆధ్వర్యంలో మల్టీ ప్లస్ డేస్ ధర్నా వెళ్లడం జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ మాట్లాడుతూ ముఖ్యంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 42 వేల రూపాయలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత ఇవ్వాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికీ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సిఐటియు ఉపాధ్యక్షులు మాయ కృష్ణ అన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాదుకు మల్టీప్లెక్స్ ధర్నాకు కార్యక్రమానికి పాల్గొన్నామని తెలిపారు. 100 రోజులలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు పర్మనెంట్ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటికి ఆమెని నెరవేర్చకపోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫ్లమైందని సిఐ ఇవ్వడం జరిగింది. వెయ్యి రోజులుదాటిన కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం మరల బిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ కూడా పడుతుందని కార్మిక వర్గం హెచ్చరిస్తూ అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి ప్రభుత్వాన్ని దింపడానికి సిద్ధమవుతున్న కార్మిక రంగానికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలు సమ్మెలోకి వెళ్తామని ముందిస్తూ హెచ్చరిస్తున్నాం నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగినాయి దానికి అనుగుణంగా జీతాలు పెంచాలని కార్మిక వర్గం కదిలింది ఇప్పటికైనా ఆలోచించి కార్మికుల కోసం చర్చ పెట్టి వాళ్లకు ప్రచారం చేయాలని సిఐటియు కోరుకుంటుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఊదరి రామచంద్ర, ఇటుకల బిక్షపతి, ఆడపువెంకటేష్, బట్టు కొండయ్య,చల్ల రాజయ్య, రాజలింగం, సిర్పంగి రవి, యాదమ్మ, సునీత, శ్యామల భాగ్యమ్మ రేణుక మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

**రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం అభినందనీయం**

**223 మంది స్వచ్ఛంద రక్తదానం.. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం**



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం భువనగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 223 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల రక్షణ, దేశ భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు పోలీసు సిబ్బంది, యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, రక్తదానం ద్వారానే అత్యవసర పరిస్థితుల్లో రోగులకు, ప్రమాద బాధితులకు అవసరమైన రక్తాన్ని అందించగలమని తెలిపారు. యువత రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రక్తదానం అనేది ఒకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, మానవతా విలువలను చాటిచెప్పే గొప్ప సేవ అని అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ శ్రీ సద్ది వెంకటరెడ్డి మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం వారి త్యాగాలకు అర్థవంతమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సేవలను, త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని, అమరవీరుల కుటుంబాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమం ప్రారంభంలో పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అధికారులు, సిబ్బంది, ఇతర ప్రతినిధులు ఒక నిమిషం మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ విద్యానగర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ శ్రీ లక్ష్మీనారాయణ, ఆర్మ్డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ శ్రీ వినోద్ కుమార్, యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, భువనగిరి డీఎస్పీ రవీందర్, చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, భువనగిరి ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ డీఎస్పీ సురేష్, జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ శ్రీ దిడ్డి బాలాజీ, జిల్లా ట్రెజరర్ ఎం.ఏ. రహీం, జిల్లా డైరెక్టర్లు జె. అంజయ్య, యి. రాంరెడ్డి, కే. ప్రభాకర్ రెడ్డి, ఈ. లావణ్య, కే. చంద్రశేఖర్, డాక్టర్ ఏ. అనిల్ కుమార్, ఎం. వెంకటేశ్వర్ రెడ్డి, ఈ. రామచంద్రా రెడ్డి, ఎస్.ఎన్. చారి, ప్రతినిధులు ఎస్పీ ఉపేందర్, స్పందన, వై. పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ భద్రతపై సమీక్ష నిర్వహించిన ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

**భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. సీసీ కెమెరాల పని తీరుపై నిరంతర పర్యవేక్షణ**



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతపై ఆలయ ఈఓ, ఎస్పీఎఫ్ అధికారులతో కలిసి ఈఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల భద్రత, నేరాల నివారణ, భద్రతా ఏర్పాట్ల పటిష్టతపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ యాదగిరిగుట్టలోని కల్యాణకట్ట, పుష్కరిణి (గుండం) ప్రాంతాలను సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అన్ని కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర నిఘా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ, భద్రతా తనిఖీలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, ఎస్పీఎఫ్, ఆలయ అధికారుల మధ్య సమన్వయంతో పనిచేయాలని, నేరాల నివారణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవానీ శంకర్, యాదాద్రి డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరి రావు, సీఐ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిందితుడికి జీవిత ఖైదీ శిక్షతోపాటు జరిమానా

**నల్గొండ ఎస్సీ ఎస్టీ కోర్టు సంచలన తీర్పు**

**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన హత్య, అత్యాచారం కేసులో వలిగొండ మండలం గొల్లేపల్లి గ్రామానికి చెందిన నిందితుడు చిన్నపాక రవితేజ కు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ నల్గొండ ఎస్సీ ఎస్టీ కోర్టు సోమవారం నాడు సంచలన తీర్పు వెల్లడించింది. న్యాయస్థానం నిందితుడికి ఐపీసీ సెక్షన్ 302 కింద జీవిత ఖైదీ శిక్ష తోపాటు రూ.5,000 జరిమానా, సెక్షన్ 376-G కింద 7 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.1,000 జరిమానా, సెక్షన్లు 201 మరియు 379 ఐపీసీ కింద ఒక్కొక్క సెక్షన్‌కు 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.1,000 చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి రిటైర్డ్ ఏసిపి భుజంగరావు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహ, కోర్టు డ్యూటీ అధికారి పిసి-4118 ఏ. రాము, సమన్ల అమలులో సహకరించిన పిసి 9667 మహేశ్ లు ప్రాసిక్యూషన్ తరఫున హాజరయ్యారు. కేసు పురోగతిలో సహకరించి నేరస్థునికి శిక్ష పడేలా చేసిన అందరిని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అభినందించారు.

## అక్రమ ఇసుక రవాణా.... రెండు ట్రాక్టర్లు సీజ్




**మోత్కూరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

ఉన్నతాధికారుల నుండి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని మోత్కూరు ఎస్.ఐ. సోమవారం ఒక ప్రకటనలో కొంపల్లి సతీష్ కుమార్ హెచ్చరించారు.మండలంలోని దత్తప్ప గూడెం గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు స్వరాజ్ ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఎస్.ఐ.సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 25న రాత్రి 10:30 గంటల సమయంలో ట్రాక్టర్ల డ్రైవర్లు ప్రవీణ్ ,అనిల్ లు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లైసెన్సులు లేకుండా మూసీ వాగులో ఇసుక తవ్వి రెండు ట్రాక్టర్లలలో లోడ్ చేసుకొని తరలిస్తున్నట్లు తమకు సమాచారం రాగానే వెంటనే సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకోగా డ్రైవర్లు పరారయ్యారన్నారు. పంచుల సమక్షంలో పంచనామ నిర్వహించి ఇసుక లోడుతో ఉన్న టి.ఎస్. 27 సి 9207 టి.ఎస్ 30 టి. 2843 నెంబర్లు గల రెండు టాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్లు ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

**-సీపీఎం డిమాండ్**



**వలిగొండ:అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య)**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని ఆపాలని అర్హులైన పేదలందరికీ ఇండ్లను అందజేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,సీనియర్ నాయకులు కళ్లెం సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి లు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో సోమవారం రోజున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న అవినీతి అక్రమాలను నివారించాలని అధికార పార్టీ రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు సిపిఎం పులిగిల్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సైదులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి, సుదర్శన్ రెడ్డి, వెంకటరెడ్డి లు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం,రాజకీయ జోక్యానికి వేదికగా మారిందన్నారు. అర్హతలు, పేదరికం, నిజమైన అవసరాలను ప్రాతిపదికగా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన ప్రభుత్వం, రాజకీయ సిఫార్సులకు తలొగ్గితే పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వ పెద్దల దయాదాక్షిణ్యాలు కాదని అర్హులైన పేదల హక్కని అన్నారు గ్రామాల్లో నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కూలీలు, వ్యవసాయ కార్మికులు, నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో రాజకీయ పలుకుబడి,పార్టీ అనుబంధాలే ప్రామాణికంగా మారితే పథకం అసలు లక్ష్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు .గ్రామానికి 80 ఇండ్లను మంజూరు చేయాలని, లబ్ధిదారుల ఎంపికను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని అన్ని రాజకీయ పార్టీలతో కూడిన కమిటీని నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మారబోయిన నరసింహ అధ్యక్షత వహించగా, శాఖ సహాయ కార్యదర్శి 7వ వార్డు సభ్యులు వేముల నాగరాజు,9వ వార్డు సభ్యులు వేముల అనిత,1వ వార్డు సభ్యులు వడ్డేమాని ధనలక్ష్మిమధు,వడ్డేమాని వెంకటయ్య,దొడ్డి బిక్షపతి, వేముల చంద్రయ్య, బుగ్గ ఐలయ్య,చంద్రమౌళి,బొడ్డు రాములు,వనం యాదయ్య, వరికుప్పల యాదయ్య,వడ్డెమాన్ రవి,వడ్లకొండ శంకరయ్య, మారబోయిన ముత్యాలు,కొమ్మిడి సత్తిరెడ్డి, వరికుప్పల శంకరయ్య, బాబు,ఈర్ల రమేష్,దొడ్డి యాదగిరి, నముద్రిపాల్, భాను, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదు చేయించిన మాజీ వైస్ ఎంపీపీ



**బొమ్మలరామారం అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య)**

కాండ్లకుంట తండాలో ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ కూకుట్ల శ్రీశైలం యాదవ్ ఓటు హక్కు నమోదు చేయించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. గ్రామ శాఖకు చెందిన భాస్కర్, మధు, రాజశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**మోత్కూరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

ఎల్ ని నో ప్రభావం దృష్ట్యా మండలంలోని పనకబండ గ్రామంలో త్రాగునీరు, పంటలు,ఉపాధి ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీఓ రఫూఫ్ అలీ కోరారు. సోమవారం మండలంలోని పనకబండ గ్రామసభ ఆ గ్రామ సర్పంచ్ లోతుకుంట రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ త్రాగు నీటిని వృధా చేయవద్దని, బోర్లు చేతి పంపుల దగ్గర నీటిని పొదుపుగా వాడాలని, మిషన్ భగీరథ నీటిని జాగ్రత్త వాడుకోవాలని సూచించారు. నీరు ఎక్కువగా అవసరం లేని చోట పంటలు ( జొన్న సజ్జ పెసర) వేసుకోవాలని, ఎల్ ని నో ప్రభావం ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు తీసుకోవాలని, పంటల బీమా చేయించుకోవాలన్నారు. వలసలు వెళ్ళవద్దని గ్రామంలోనే ఉపాధి పనులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయం మోటార్లు పగలు వాడవద్దని, అధిక లోడ్ వల్ల కాలిపోతాయని, కరెంటు తీగలు తెగితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఎండ దేవత ఎక్కువగా ఉంటుందని వడదెబ్బ తలవకుండా మధ్యాహ్నం సమయంలో బయటికి వెళ్ళవద్దన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కె అలివేలు, ఉప సర్పంచ్ రాధారపు మల్లేశం, వార్డు సభ్యులు బత్తిని మల్లేష్,బట్టు మత్స్యగిరి ఉపాధి హామీ, మిషన్ భగీరథ, విద్యుత్ వ్యవసాయ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు.08



# ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటుకు సమిష్టిగా కృషి చేయాలి

**మోత్కూరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**




మోత్కూరు ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయుటకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. సోమవారం మోత్కూరులో ఆర్టీసీ బస్ డిపోను సాధించుకుందాం అనే అంశంపై స్థానిక ఆర్యవైశ్య భవనంలో అఖిలపక్షం సమావేశాన్ని ఆ డిపో సాధన సమితి కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇక్కడ ఆర్టీసీ బస్ డిపో లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం నోచుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యే,ఎంపీ పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ముందు మోత్కూరు లో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేసి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైయ్యారని ఆరోపించారు. 1985 నుంచి విద్యార్థి యువజన ప్రజాసంఘాలు రాజకీయ పార్టీలు ఈ బస్ డిపో కోసం ధర్నాలు, రాస్తారోకోలు, పాఠశాల కళాశాలలో తరగతుల బహిష్కరణ, విద్యార్థి యువజన ప్రజలచే సంతకాల సేకరణ, తహశీల్దార్ నుంచి కలెక్టర్ ,ఎమ్మెల్యే , ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రులకు వినతి పత్రాలను అందజేస్తున్నప్పటికీ పాలక ప్రభుత్వాలలో ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఉద్యమాల కార్యక్రమంలో భాగంగా 1989 లో మోత్కూరుకు ఆర్టీసీ బస్ డిపో మంజూరైనప్పటికీ అప్పట్లో ఇక్కడ ఉన్న నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల మోత్కూరు కు మంజూరైన బస్ డిపో అప్పటి వరంగల్ జిల్లా తొర్రూరు కు వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బస్ డిపో ఏర్పాటు చేయుటకు మోత్కూరు, గుండాల , ఆత్మకూరు (ఎం), అడ్డగూడూరు మండలాల పక్షం విద్యార్థి యువజన ప్రజా సంఘాలతో బలమైన ఉద్యమాన్ని నిర్మించి పోరుబాట ఉధృతం చేయాలని కోరారు. అనంతరం మోత్కూరులో బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రాష్ట్ర నోడల్ అధికారి విద్యాసాగర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడిసి మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కారు పోతుల వెంకన్న గౌడ్, అఖిలపక్షం నాయకులు పోన్నెబోయిన రమేష్, జంగ శ్రీను,చౌగొని సత్యం గౌడ్,అవిశెట్టి అవిలిమల్లు, మెంట నగేష్, దేవపాలన్, బ్రహ్మాచారి, తొగిటి మనోహరాచారి,పోచం సోమయ్య, తీపిరెడ్డి సోమిరెడ్డి బొల్లు యాదగిరి, బయ్యని రాజు,కలిమెల నర్సయ్య, తాడూరి లక్ష్మీ నర్సయ్య, పులకరపు మల్లేశం, బైరు నర్సయ్య, లింగంపల్లి రఘువర్ధన్, ఎడ్ల నరేష్,ఎలిమినేటి జాహంగీర్, డబ్బేటి సోంబాబు,కాపర్తి సైమాన్, కూరెళ్ళ వెంకన్న, బుర్ర శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## రక్తదానంలో పాల్గొన్న మోత్కూరు పోలీసులు




**మోత్కూరు, అక్టోబర్ 26( వార్త వేదిక సూర్య):**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రమైన యాదాద్రి భువనగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మోత్కూరు ఎస్ఐ కె.సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొని రక్త దానం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ,రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడాలనే సందేశాన్ని చాటారు.

## ఒకే రోజు ఏఈఈ ఎస్ఎస్సి జెఈ పరీక్షలు

### . షెడ్యూల్ తేదీలను మార్చాలని ఏఐ ఎస్ఎఫ్ డిమాండ్

**మోత్కూరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య) :**



తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజినీర్ (ఎస్ ఎస్ సి జె.ఈ ) పరీక్షల తేదీలు ఒకే రోజు ఉండటంపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మోత్కూరు లో విలేకరులతో మాట్లాడుతూ రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒక పరీక్షకు మాత్రమే హాజరయ్యే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉన్నందున రాష్ట్ర పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి చదువుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ పోటీపడుతున్న ఇంజినీరింగ్ అభ్యర్థులు పరీక్షల తేదీల మధ్య సమన్వయం లేకపోవడంతో నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, షెడ్యూల్ల లో సమన్వయం లేకపోవడం వల్ల ఒక ఉద్యోగ అవకాశాన్ని కోల్పోవాల్సి రావడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ నియామక పరీక్షలు నిర్వహించే సంస్థలు పరస్పర సమన్వయంతో తేదీలను నిర్ణయించాలని కోరారు. అభ్యర్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకోకుండా పరీక్షల షెడ్యూల్ రూపొందించడం నిరుద్యోగ యువతలో ఆందోళనకు కారణమవుతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్ష తేదీని మార్చాలని శాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి జిట్టా గౌతమ్, మండల నాయకులు వంశీకృష్ణ, ప్రవీణ్, సాయి, రాజు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి బి కే ఎస్




**బొమ్మలరామారం అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య)**

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం మండలంలో "చలో మండల ఆఫీస్" నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాటం అయిలేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరంగల్లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ను యధాతధంగా అమలు పరచాలని ప్రభుత్వాన్ని కోరారు రైతులకు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు 15 వేల రూపాయలు ఇవ్వాలని, కౌలు రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరాకు 15000 ఇవ్వాలని, పంటలకు బీమా కల్పించాలని అన్నారు. ఎలినినో పరిస్థితులు సమీక్షించి యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని పశువులకు పశుగ్రాసాన్ని ప్రభుత్వమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బొమ్మలరామారం మండల తాసిల్దార్ అనురాధకు వినతి పత్రం అందజేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బెజ్జంకి పాపిరెడ్డి, మండల కమిటీ సభ్యులు గురువారెడ్డి, ముఖ్యర్ల గణేష్, సిద్దెకి బాబు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలు చౌకబారు విమర్శలు మానుకోవాలి



### కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్

**మోత్కూరు, అక్టోబర్ 26 ( వార్త వేదిక సూర్య):**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బిఆర్ఎస్ నేతలు స్థాయి మించి విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షులు బద్దం నాగార్జున రెడ్డి లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం పై ముందు జాగ్రత్తగా రాష్ట్ర ప్రజలకు విపత్తులను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేస్తే కొంతమంది బిఆర్ఎస్ మండల నాయకులు స్థాయికి మించి ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ప్రాజెక్టులలో నీటిమట్టం తగ్గి భూగర్భ జలాలు ఎండిపోతుంటే గోదావరి, కృష్ణాజిల్లాలో ఆంధ్రప్రదేశ్ కు పోతున్నాయని ఈ నీరు ఆంధ్రకు పోయేందుకు గత ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య కారణమన్నారు. నాడు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం చేస్తే దానికి రీ డిజైనర్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమని కమిషన్ల కోసం కక్కుర్తి పడి నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతో నేడు కృంగిపోయి గోదావరి జలాలు వృధాగా పోతున్నాయంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేనని పేర్కొన్నారు.పదేళ్ల రాష్ట్ర పరిపాలనలో స్వరాష్ట్రాన్ని దివాలా తీయించిన దద్దమ్మలు బిఆర్ఎస్ పార్టీ నాయకులేనని విమర్శించారు.రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తుంటే బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తప్పుటడుగులు వేస్తే విమర్శలు అనేది సున్నితంగా ఉండాలని స్థాయిని మించి మాట్లాడితే సహించేదే లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్,స్థానిక నాయకులు అవిశెట్టి నాగరాజు, కందుకూరి నర్సింహ్మ, కూరెళ్ల అంజయ్య, దేవరపల్లి రంగారెడ్డి, అర్ధ ప్రతాపరెడ్డి,ఫాలోజు శేఖరాచారి,కోమటి జనార్ధన్, కందుకూరి మురళి కూరెళ్ల యాదయ్య,ఇంద్రాల బిక్షం, మందుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ, పీడనలకు విముక్తి నూతన ప్రజాస్వామిక విప్లవమే

**ఆలేరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

దోపిడీ, పీడన, అన్యాయం, అణిచివేతల నుంచి ప్రజలకు విముక్తి కల్పించేది నూతన ప్రజాస్వామిక విప్లవమేనని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 26న శారాజీపేటలో కామ్రేడ్ దూడల వెంకన్న 37వ వర్ధంతి సభను సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్తూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ గ్రామ కార్యదర్శి అయిల యాకయ్య జెండాను ఆవిష్కరించగా, గ్రామ ప్రధాన వీధుల గుండా ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. సభలో నాయకులు మాట్లాడుతూ.. దేశ సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రామిక ప్రజలు కనీస సౌకర్యాలకు సైతం నోచుకోకుండా దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడిన నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. కామ్రేడ్ దూడల వెంకన్న పోరాట స్ఫూర్తిని, విప్లవోద్యమంలో ఆయన పోషించిన పాత్రను నాయకులు స్మరించుకున్నారు. ఆలేరు ప్రాంతంలో గతంలో పీపుల్స్ వార్ గ్రూప్ చేపట్టిన చర్యలపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, సీనియర్ కార్యకర్త అయిల పెద్ద మార్కయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. సీత, మందనపల్లి ఉపసర్పంచ్ పద్మ శశిరేఖ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పద్మ సుదర్శన్, అరుణోదయ



జిల్లా అధ్యక్షుడు శికిలం కుమారస్వామి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్ధేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల బాల మల్లేష్, సహాయ కార్యదర్శి తమ్మడి అంజయ్యతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# యాదాద్రి భువనగిరి

## దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**మోత్కూరు, అక్టోబర్ 26 ( వార్త వేదిక సూర్య):**

ఈ ఏడాది జూలై , ఆగస్టు మాసాలలో కురిసిన వర్షాలతో వరద ఉధృతికి మండలంలో పాటిమట్ల గ్రామంలోని బతుకమ్మ ఘాట్.వద్ద రోడ్డు కోతకు గురై రోడ్డు ప్రక్కనే ఉన్న బావిలో పడే ప్రమాద పరిస్థితి ఏర్పడిందని ఆ గ్రామ సర్పంచ్ బండ రమ విజయ్ రెడ్డి సోమవారం అడ్డగూడూరు మండలానికి వెళ్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రయాణిస్తున్న ప్రయాణంలో ఆ ప్రాంతం వద్ద కొద్ది సేపు ఆగి సర్పంచ్ బండ రమ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లుగౌడ్ కలిసి వరదలకు దెబ్బతిన రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు కోతకు గురి కావడంతో ప్రజలకు వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని, ప్రమాద నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులకు తన చరవాణి ద్వారా సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రోడ్డు మరమ్మతులు చేపట్టి బావి వద్ద తగిన రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండెబోయిన సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు కురిమేటి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు



**మోత్కూరు, అక్టోబర్ 26 ( వార్త వేదిక సూర్య):**

మోత్కూరు మండలంలో పాలడుగు గ్రామంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో 930 పై జాతీయ ప్రధాన రహదారిపై సోమవారం ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టీజీ 26 టి 6335 నెంబర్ గల ఆటో హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తుండగా పాలడుగు గ్రామ సమీపంలో ప్రమాదానికి గురైంది. ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఇందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. మహబూబాబాద్ లో తమ పిల్లలను హాస్టల్ లకు తీసుకెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న స్వల్ప గాయాలు కావడంతో బాధితులు ప్రథమ చికిత్స చేసుకొని అనంతరం వెంటనే స్వగ్రామానికి అదే ఆటోలో వెళ్లారని స్థానికులు తెలిపారు. గౌరెల్లి _ కొత్తగూడెం మార్గంలో 930 పి ప్రధాన రహదారిపై తరచుగా ప్రమాదం జరుగుతుండటంతో రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరుస ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికులు భద్రతకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**రామన్నపేట అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య )**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.చ ఈ కార్యక్రమాలో రామన్నపేట మండల తహసీల్దార్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పున్న జగన్మోహన్ సింగల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి రామన్నపేట సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి కొమ్మయ్య గూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉప సర్పంచ్ మోటే రమేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులు జిలకర ప్రభాకర్ గుత్త నర్సిరెడ్డి సాల్వేర్ అశోక్ వనం చంద్రశేఖర్ జిల్లా వెంకటేశం కోట సుధాకర్ రాయిని రమేష్ శంబాల వెంకన్న వెంకటేశం పిట్ట వెంకటరెడ్డి మొహమ్మద్ నాసర్ మొహమ్మద్ మన్సూర్ అలీ మోటే మహేష్ కొమ్ము శేకర్ బత్తుల నవీన్ ఎర్ర శేఖర్ ఏ పరమేశ మొహమ్మద్ రిజ్వాన్ అజార్ రుద్రాల విక్కి తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య)**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 127 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవిన్యూ శాఖ 65, సర్వే ల్యాండ్స్ 13, హౌసింగ్ 10,వైద్య ఆరోగ్య శాఖ 6, పంచాయతీ 5,ఉపాధి కల్పన 4, జిల్లా పరిషత్ 4,మున్సిపాలిటీ 3, వ్యవసాయ శాఖ 2,ఇరిగేషన్ 2, ఎల్.డి.యం, సివిల్ సప్లై, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ,మైన్స్,మెడికల్ కాలేజీ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్య, విద్యుత్, ఆర్ అండ్ బి, ఆర్టీసీ,డి.ఎల్.పి.ఓ, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్,జెడ్పీ సీఈఓ శోభా రాణి, హౌసింగ్ పీడీ అలివేలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గొప్ప సందేశాన్ని అందించిన వాల్మీకి మహర్షి

**కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు**



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి జీవిత విశేషాలను స్మరిస్తూ, రామాయణాన్ని రచించి ప్రపంచానికి నీతి, ధర్మం, మానవీయ విలువలను చాటిచెప్పిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం, ఆయన సాధించిన పరివర్తన ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రామాయణంలోని ఆదర్శాలను, నైతిక విలువలను ముఖ్యంగా విద్యార్థులు, చిన్నారులకు అర్థమయ్యేలా వివరించాలని, మహనీయుల జీవిత చరిత్రలు, ఆశయాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్ ,జిల్లా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి,ఎస్ సి కార్పొరేషన్ ఈ.డి శ్యాంసుందర్, కలెక్టరేట్ ఏ.ఓ అంజి రెడ్డి,వివిధ కుల సంఘ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తాగునీటి కష్టాలు

**- ఇది ప్రకృతి వైపరీత్యం కాదు..**

**మానవ నిర్మిత కరవు: గొంగిడి సునీత**



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

గుండాల మండలంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తీవ్రంగా మారాయని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఏర్పడిన మానవ నిర్మిత కరవు అని విమర్శించారు. గుండాల మండల కేంద్రంలో సోమవారం ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నవాబుపేట రిజర్వాయర్‌కు నీటిని తరలించి వరుసగా ఆరు పంటలను కాపాడామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు మళ్లీ తాగునీటి కోసం బిందెలు పట్టుకుని రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ఆరు నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ముందస్తు ప్రణాళికతో రిజర్వాయర్లను నింపడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజల నీటి సమస్యలను పరిష్కరించకుండా ఎల్‌నినోను సాకుగా చూపడం సరికాదని విమర్శించారు.

# పిల్లల రక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

**- పోక్సో చట్టం, సోషల్ మీడియా జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన**




**యాదాద్రిభువనగిరి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

పిల్లలపై లైంగిక నేరాల నివారణ, వారి హక్కుల పరిరక్షణకు పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి. స్వాతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా సోమవారం భువనగిరి పట్టణంలోని దేదీప్య పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే చట్టం (పోక్సో చట్టం–2012)లోని ముఖ్యమైన అంశాలు, నేరాలకు విధించే శిక్షలు, బాధితులకు అందించే నష్టపరిహారం, పిల్లలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై వివరించారు. ముఖ్యంగా బాలికలు సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదని సూచించారు. ఏదైనా వేధింపులు లేదా అనుచిత ఘటనలు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అవగాహన కల్పించారు. డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తత అవసరం భరోసా కేంద్రం ఎస్ఐ సంధ్య మాట్లాడుతూ.. డిజిటల్ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కొద్దీ దాని వినియోగంలో అప్రమత్తత మరింత అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జాగ్రత్తగా వినియోగించకపోతే నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు, సేవలు అందించేందుకు భరోసా కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు. న్యాయ సహాయ న్యాయవాది సి.హెచ్. సరిత మాట్లాడుతూ.. ఉచిత న్యాయ సహాయం పొందేందుకు ఉన్న అర్హతలు, బాధితులకు అందించే నష్టపరిహారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పరిధిలో అందుబాటులో ఉన్న సేవల గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ రంగారావు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు, క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల భద్రత, సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని, న్యాయ సేవాధికార సంస్థ నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు వారికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు శేషగిరి రావు, రవి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలి

**శ్రీ గౌతమ్ విద్యా సంస్థల అధినేత డా.మిర్యాల.దుర్గాప్రసాద్**



**భువనగిరి అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని శ్రీ గౌతమ్ విద్యా సంస్థల కరస్పాండెంట్, తెలంగాణ రికగ్నైజేడు స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా నాయకులు డా.మిర్యాల దుర్గాప్రసాద్ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రైవేట్ విద్యా రంగం కీలక పాత్ర పోషిస్తోందని, సుమారు ఐదు లక్షల మంది ఉపాధ్యాయులకు ఉపాధి కల్పిస్తూ, 35 లక్షల మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అందించాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించే వారిని తమ ఓటు హక్కుతో ఎన్నుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి అర్హుడైన పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అర్హులైన ప్రైవేట్ ఉపాధ్యాయులు, సిబ్బంది ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పట్టభద్రుల ఓటరు నమోదును సకాలంలో పూర్తి చేసుకోవాలని, ఇప్పటికే నమోదైన వారు ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

# క్వింటాకు 10 వేల రూ. పెంచేలా కృషి చేస్తా



**ఎమ్మెల్యే మందుల సామేల్**

**అడ్డగూడూరు, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య)**

ఎలినినో ప్రభావం వల్ల పత్తి దిగుబడి తక్కువ వచ్చినందున పత్తి రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర అందేలా పత్తి ధరను కింటాకు రూ.10 వేలకు పెంచేందుకు కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం అడ్డగూడూరు మండలం చౌల్ల రామారం గ్రామంలో నీ సాయి శ్రీనివాస్ పత్తి మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఎలినినో ప్రభావం వల్ల పత్తి దిగుబడి తక్కువగా వచ్చిందన్నారు. గతంలో పత్తి ఎకరాకు 10 నుండి 12 క్వింటాల వరకు దిగుబడి వచ్చేదని, ఈ సంవత్సరం పత్తి ఎకరాకు 3 నుండి 4 క్వింటాలు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు చాలా నష్టపోయారని అన్నారు. సీసీఐ మద్దతు ధర రూ.8,667గా ఉండగా ప్రైవేట్ మార్కెట్లో రూ.9 వేలకు పైగా పలుకుతోందని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా పత్తి ధరను రూ.10 వేలకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు తమ పత్తిని తేమ లేకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. తూకం, నాణ్యత పరిశీలన, ధర నిర్ణయం, చెల్లింపులు పారదర్శకంగా నిర్వహించాలని కొనుగోలు యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్, అడ్డగూడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు నిమ్మన గోటి జోజి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు మందుల సోమయ్య, సర్పంచులు చేడే అంబేద్కర్, కన్నెబోయిన లింగస్వామి, కాంగ్రెస్ నాయకులు పాశం సత్యనారాయణ, గూడెపు పాండు, పూల పెల్లి సోమి రెడ్డి, చిత్తలూరి రవీందర్, ఇటికాల చిరంజీవి, బాలెంల సైదులు, సందీప్ రెడ్డి, కదారి రమేష్, మారిశెట్టి మల్లేష్, తోట మహేష్, మందుల సోమన్న, కదారి నాగరాజు, కేంద్రం నిర్వాహకులు, సిబ్బంది, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా శరత్ పూర్ణిమ వేడుకలు

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరత్ పూర్ణిమ వేడుకలు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఊరేగింపు సేవ ఆలయం నుంచి బయలుదేరి, తూర్పు రాజగోపురం వద్ద వేంచేపు మండపానికి చేరుకుంది. స్వామివారిని అధిష్టింపజేసి వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు, అర్చనలతో శరత్ పూర్ణిమ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు రకాల భోగాలను నైవేద్యంగా సమర్పించారు. శరత్ పూర్ణిమ సంప్రదాయంలో భాగంగా పాలను చంద్రుని కాంతిలో ఉంచి, చంద్రదర్శనం అనంతరం స్వామివారికి సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

**శరత్ పూర్ణిమ విశిష్టత:**

మన సంప్రదాయములో శరత్ పూర్ణిమకు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. దీనిని కౌముది పూర్ణిమ అని కూడా పిలుస్తారు. శరదృతువులో వచ్చే ఈ పౌర్ణమి వెన్నెల సౌందర్యానికి, ఆధ్యాత్మిక ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తుంది. పురాణ సంప్రదాయాల ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో శ్రీ లక్ష్మీ దేవి సమేతులైన శ్రీ నరసింహస్వామి వారిని విశేషంగా ఆరాధిస్తూ, కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శాంతి, శ్రేయస్సు కలగాలని ప్రార్థిస్తారు. ఈ పవిత్ర పర్వదినం భక్తిభావాన్ని, దైవచింతనను, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకోవడానికి విశేషమైనదిగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో భవానీ శంకర్, ప్రధానార్చకులు కాండూరు వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్ర చార్యులు, ఆలయ ఏఈవో దొమ్మాట సురేందర్ రెడ్డి, అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు, కార్యాచరణపై గొంగిడి సునీత సమీక్ష



**ఆలేరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

రానున్న ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆలేరు నియోజకవర్గంలోని గుండాల, మోటకొండూరు, యాదగిరిగుట్ట మండలాలకు చెందిన ఇన్‌చార్జీలతో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రతి 100 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించిన నేపథ్యంలో, ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఇన్‌చార్జీలకు దిశానిర్దేశం చేశారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ఆలేరు, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**



ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై మెగా సుభాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ ఏటీసీ, ఐటీఐ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులపై ప్రజల్లో అవగాహన పెంచడంలో యువత కీలక పాత్ర పోషించాలని నిర్వాహకులు సూచించారు. నీరు, ఆహారం, విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ సహజ వనరులను సంరక్షించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు తాళ్లపల్లి మహేష్ పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్‌కు యువకుడు బలి

**- అప్పుల బాధతో బలవన్మరణం..**

**భార్యకు ఆవేదన లేఖ**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడి, భారీగా అప్పులపాలైన ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భువనగిరి పట్టణంలో విషాదం నింపింది. రాజపేట మండలం రేణిగుంట గ్రామానికి చెందిన గంధమల్ల భరత్‌కుమార్ గౌడ్ భువనగిరిలో అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. భార్యకు ఆవేదన లేఖ ఆత్మహత్యకు ముందు భరత్‌కుమార్ తన భార్యను ఉద్దేశించి లేఖ రాసినట్లు తెలిసింది. 'నన్ను క్షమించు.. ఎన్నిసార్లు మారాలనుకున్నా మారలేకపోయాను. నీలాంటి భార్య దొరకడం నా అదృష్టం. నీకు, పాపకు సారీ.. పాపను జాగ్రత్తగా చూసుకో' అంటూ తన ఆవేదనను వ్యక్తం చేసినట్లు సమాచారం. బెట్టింగ్ వ్యసనంతో డబ్బులు కోల్పోయి, అప్పుల భారం పెరగడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కుటుంబంలో, స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచిస్తున్నారు.



# తెలంగాణ రక్షణ సేన అధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ల ప్రత్యేక డ్రైవ్



**భువనగిరి టౌన్ అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

భువనగిరిలో పట్టభద్రుల ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్వ రంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా, ఉమ్మడి నల్గొండ జిల్లా భువనగిరి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు క్యాంపును సోమవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ మద్దతు తెలుపుతూ ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల సుజిత్ రావు మాట్లాడుతూయ అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: నియోజకవర్గ పరిధిలోని ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టభద్రులకు, నిరుద్యోగ యువతకు ఎటువంటి న్యాయం చేయలేకపోయిందని విమర్శించారు.చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనపై, వారి సమస్యలపై శాసన మండలిలో నిలదీసే సరైన అభ్యర్థిని ఎన్నుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందన్నారు.

గతంలో ఎన్నికైన పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరుకే ఎమ్మెల్సీగా మిగిలారని, మండలిలో నిరుద్యోగుల సమస్యలపై ఎన్నడూ మాట్లాడలేదని ధ్వజమెత్తారు. సమర్థుడైన అభ్యర్థి శ్రీకాంత్ గౌడ్ విద్యార్థి దశ నుంచే వచ్చి, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన ఉద్యమకారుడు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ నిరుద్యోగుల బాధలను తెలిసిన వ్యక్తి అని పేర్కొన్నారు. నిరుద్యోగుల తరపున మాట్లాడే బలమైన గొంతుకగా కల్వకుంట్ల కవిత ఆయనను అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. హాజరైన ముఖ్య నాయకులు

**ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో:**

పార్టీ ఎన్నికల అబ్జర్వర్ సమన్వయకర్త: ఇస్మాయిల్ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు తంగళ్లపల్లి శ్రీకాంత్, సూరారపు కృష్ణవేణి జిల్లా నాయకులుఆకుల నరేష్ మంచాల సంతోష్ చిన్నం ప్రభాకర్, మందువ మహేష్ సన్నీ ప్రమోద్,భాను, వెల్దుర్తి సాయినాథ్,గణేష్,సాగర్, గోపీనాథ్, పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**చౌటుప్పల్, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య) :**

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ ఈడుదుల మస్తాన్ బాబు యాదవ్ తెలిపారు. పి.ఎ.సి.యస్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో మందోల్లగూడెం, స్వాములవారి లింగోటం, నేలపట్ల, అంకిరెడ్డిగూడెం, నక్కలగూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ ఉబ్బ వెంకటయ్య, జిల్లా సహకార అధికారి కె నాగార్జున లతో కలిసి సహకార సంఘం చైర్మన్ ఈడుదుల మస్తాన్ బాబు యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరలకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ ఏఆర్ బి సురేష్, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్ వెల్గ రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు నల్ల నరేందర్ రెడ్డి, బొబ్బిళ్ళ రాజేందర్, సురకంటి లక్ష్మమ్మ, జక్కిడి వెంకట్ రెడ్డి, రావుల స్వామి, గుర్రం మనోహర్ రెడ్డి, మల్కాపురం సుగుణమ్మ, మేకల దేవేందర్ రెడ్డి, బత్తుల శ్రీహరి, వివిధ గ్రామాల సర్పంచులు తంగెళ్ల వెంకటేశం, భీమిడి ప్రదీప్ జీ, గంగాపురం వసంత నగేష్ గౌడ్, సుర్వి మల్లేష్ గౌడ్, ఉప సర్పంచులు సుర్కంటి శ్రీధర్ రెడ్డి, బాతరాజు ధనుంజయ, పిన్నింటి శ్రీనివాస్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య, సంఘం కార్యదర్శి వై రమేష్, జిపిఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన ధర్మకర్తగా బడుగు బాలరాజు

**చౌటుప్పల్ అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య )**



అయోధ్యలో నిర్మించనున్న శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీయ నిత్యాన్న సత్రము అయోధ్య ధర్మకర్తగా చౌటుప్పల్ కు చెందిన బడుగు బాలరాజు ఎన్నికయ్యారు. గత కొన్ని దశాబ్దాలుగా హిందూ సనాతన, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక వికాసానికి చేస్తున్న భగవత్ సేవలను గుర్తించి ధర్మకర్తగా నియమించారని ఆయన తెలిపారు. అఖిలభారత పద్మశాలీయ నిత్య అన్న సత్రముల మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్ పద్మశాలి అయోధ్య అన్న సత్ర అధ్యక్షుల భూరం శంకర్, కార్యదర్శులు, గజం గురునాథం లకు ఎన్ని కకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి పద్మశాలీయుల సహకారముతో సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఎన్నికైన బడుగు బాలరాజు ఘనంగా సన్మానించారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**తుర్కపల్లి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొని రక్తదాన శిబిరానికి తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, దత్తాయపల్లి సర్పంచ్ జెరిపోతుల కరుణాకర్, బాలు యాదవ్, పవన్ కుమార్, విఘ్నేష్ నాయక్, నరేష్ యాదవ్, ఎల్లేష్ యాదవ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# ఏల్నినో ప్రభావం పై గ్రామ సభ



**బీబీనగర్ మండల్ అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య)**

యాదాద్రి భువనగిరి జిల్లా బిబినగర్ మండల్ కొండమడుగు గ్రామంలో గ్రామ సర్పంచ్ కడెంపాడురంగం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మనమందరం కలిసి ఏలినో ప్రభావం వల్ల వర్షాలు పడటం లేదు నీటి ఎద్దడి మొదలవుతుంది దీని ద్వారా త్రాగునీరు సాగునీరు విద్యుత్తు ఈ మూడు రకాల ప్రాబ్లమ్స్ మనము ఎదురుకుపోవాల్సి వస్తుంది వాటిని ప్రత్యమానంగా మనము ఎట్లా ఎదుర్కోవాలి దానిమీద గ్రామ సభలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజలు భాగస్వామ్యం ఉంటే ఈ కార్యక్రమము విజయవంతం అవుతుంది ఉద్దేశం తోటి గ్రామసభలు జరుగుతున్నాయి మన జిల్లా అంతట అగ్రికల్చరల్ ఎలక్ట్రిక్ సిటీ వారు ఉన్నారు ఉపాధి హామీ సిబ్బంది వారి వారి కేటగిరి ఈ నీటి ఎద్దడిని తట్టుకోవడానికి మనం ఏం చేయాలి ప్రభుత్వం ఏం చెప్తుంది మేము ఏం చెప్తాము వినాలి దానిని పాటించాలి ఏదైనా ఇబ్బంది ఇప్పటివరకు రాలే కాబట్టి బాగానే ఉంది ఇప్పుడు ఇబ్బంది వచ్చింది ఎదుర్కోవాల్సిన సమస్య ఇప్పుడు నీటి పొదుపు చేయాలి విద్యుత్ పొదుపు చేయాలి భూగర్భ జలాలు పెరగడానికి మనం ఏం చేయాలి కాబట్టి మనం అర్థం చేసుకొని ఈ సమస్య నుంచి గట్టెక్కాలి కాబట్టి అందరి సమస్య వర్షం రావాలంటే ప్రకృతి ఏమి చేయలేం ప్రభుత్వం కూడా ఏం చేయలేదు కానీ దాని నివారించడానికి మార్గాలు ఉంటాయి. ఆ మార్గం మనం ఫాలో కావాలి కరోనా వచ్చింది మనము మాస్కులు వేసుకున్నాము కొన్ని జాగ్రత్తలు పాటించినాము ఇప్పుడు కూడా కరువు వచ్చింది దాన్ని కూడా మనము ఎదుర్కోవాలి కాబట్టి వ్యవసాయ వారి పంటలు వేయకూడదని పోయిన వర్షాకాలంలోనే చెప్పినాము కానీ కొంతమంది వేశారు ఇప్పుడు యాసంగి పంటలు వేయొద్దు అని చెపుతున్నాము కరెంటు ఉత్పత్తి తగ్గిపోతుంది ఈ ప్రభావం మన మీద ఇబ్బంది పడతాయి కాబట్టి ముందుగా ఏలినో ప్రభావం ఉంటుంది గ్రామ ప్రజలు మండల ప్రజలు ముందు జాగ్రత్తగా ఆలోచించి జాగ్రత్తగా ఉండాలని కోరుచున్నాను ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుభాషిని గ్రామ ఉపసర్పంచ్ అరిగే శ్రీధర్ వాడు మెంబర్స్ గ్రామ పెద్దలు మరియు మండల అధికారులు ఎంపీ ఓ పి కళావతి ఎం ఏ ఓ పద్మ ఏఈ పి రవికిరణ్ ఆర్ ఐ జహంగీర్ జిపిఓ కే శ్రీనివాస్ ఏ ఈ ఓ పిహెచ్సి శ్రావణ్ హెచ్ ఓ ప్రభాకర్ ఆశ వర్కర్స్ బాలమణి ఏ సునీత వివో ఏ అంజమ్మ కె చంద్రకళ ఎం అనిత గ్రామ సంఘ బంధం అధ్యక్షులు బాలమణి ఎం స్వప్న పి అనిత తదితరులు పాల్గొన్నారు.

# యాక్సెంట్ లైట్ల కొనుగోళ్లలో అక్రమాలు

**రూ.640 లైట్‌కు**
**రూ.2,750 చెల్లింపులు**
**సమగ్ర విచారణ జరిపించాలి**
**కలెక్టర్‌కు బీజేపీ వినతి**



**యాదాద్రి, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో యాక్సెంట్ లైట్ల (36 వాట్స్) కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగాయని బీజేపీ యాదగిరిగుట్ట పట్టణ శాఖ నాయకులు ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో జీఎస్టీతో కలిపి రూ.640 ధర పలుకుతున్న లైట్‌ను మున్సిపాలిటీ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఒక్కో దానిని రూ.2,750 చొప్పున కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. వీధి లైట్ల (ఒక్కో లైట్) కొనుగోలులో మార్కెట్ ధరతో పోలిస్తే భారీ వ్యత్యాసంతో ప్రజాధనం దుర్వినియోగమైందని ఆరోపించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, పట్టణంలో మున్సిపల్ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. యాక్సెంట్ లైట్ల కొనుగోలు ప్రక్రియ, టెండర్ పత్రాలు, బిల్లులు, చెల్లింపులపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌తో పాటు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు మందోజ్ నరేష్, పలుగుల సురేష్, సీనియర్ నాయకుడు ఎరుకల చైతన్య గౌడ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కాల్లూరి విజయ్, సంద ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ

## బుర్హానొద్దీన్ ఔలియా దర్గా గంధం ఊరేగింపు

**ముత వల్లి ఖాజా బషీరొద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు**
**కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు**
**ఉర్సు ఉత్సవాలకు భారీగా తరలి వచ్చిన ప్రజలు**



**భువనగిరి అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

భువనగిరి పట్టణంలో స్థానిక కిసాన్ నగర్ లొ గల బుర్హానియ దర్గా ఉర్సు ఉత్సవాలలొ భాగంగా,దర్గా ముతవల్లి ఖాజా బషీరొద్దీన్ ఆధ్వర్యంలో గంధం ఊరేగింపు కల్మే,షరీఫ్ నాతే షరీఫ్, ధార్మిక పాఠాలు పఠిస్తూస్థానిక గంజ్ మెమన్ మసీద్ నుండి ప్రారంభం అయి గంజ్,పాత బస్టాండ్ మీదుగా దర్గా వద్దకు చేరుకుంది.దర్గా నిర్వాహకు లు ఖాజా అజీమొద్దీన్ ఖాజా మొయినొద్దీన్,ఖాజా ఖుతుబొద్దిన్ బబ్బు ఆధ్వర్యంలో పూల చాదర్ సమర్పించిప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లొ వక్ఫ్ ప్రొటెక్షన్ కమెటీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎండీ ఇంతియాజ్ అహ్మద్ ఉపాధ్యక్షులు ఎండీ ఇస్తియాక్ అహ్మద్,ఉర్సు ఉత్సవ కమెటీ సభ్యులు అమీన్ మెమన్ సయ్యద్ ఆమెర్,ఫైజన్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా వాల్మీకి జయంతి



**యాదాద్రి భువనగిరి బ్యూరో, అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య)**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా పిలుపు మేరకు సోమవారం నాడు బిజెపి జిల్లా కార్యాలయలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి తెరపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మూర్చ జిల్లా అధ్యక్షుడు చెరుకు వెంకటేష్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెంద మహేందర్ గుప్త, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం, బలరాం పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి కృష్ణ చారి, sc మోర్చా జిల్లా నాయకులు కోళ్ల బిక్షపతి, బండారు లోకేష్, కానుకుంట్ల రమేష్ కోటి , ఎరుపుల శివప్రసాద్, కొల్లోజ్ సతీష్, కొలిచెల్మామల్లేష్, బండారి శివశంకర్, ఎర్రవెల్లి నాగరాజు, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు మామిడోజు పవన్ స్వామి, మహేష్, మర్రి శివ పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**తుర్కపల్లి , అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

తుర్కపల్లి మండలం, గుజ్జవానికుంట తండ గ్రామ పంచాయతీలో సర్పంచ్ గూగులోతు దూప్ సింగ్ నాయక్ ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. రేషన్ సరుకులు పొందడంతో పాటు, ఆరోగ్యశ్రీ పథకం తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. ఉపసర్పంచ్ ధీరావత్ సునీత లింగ నాయక్, వార్డు సభ్యులు గూగులోతు గణేష్ నాయక్, జగిని శక్రు నాయక్, హాళ్య నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉర్సు ఉచ్చవాలు పాల్గున్న ఎమ్మెల్యే



**యాదాద్రి భువనగిరి బ్యూరో అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య)**

భువనగిరి పట్టణం లోని స్థానిక జామలే బహార్ దర్గా లో ఉర్సు ఉత్సవల లో భాగంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ముఖ్య అతిగా పాల్గున్నారు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం గ్రంథాలయం సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, మున్సిపల్ చైర్మన్ తంగిళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ ముత్తంశెట్టి మంజుల వెంకటట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, పిసిసి డెలిగేట్ నెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్, కౌన్సిల్ సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్.కె మజర్ పాషా, ఎడ్ల వెంకట్ రెడ్డి, సమి ఇల్యాస్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# రెడీ మిక్స్ ప్లాంట్ కు అనుమతులు వద్దు

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్**

**చిట్యాల, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో కొత్తగా నిర్మించే రెడీ మిక్స్ ప్లాంట్ వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్య బారిన పడనున్నందున ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు.చిట్యాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు సోమవారం నాడు వెలిమినేడు సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హోటళ్ళు, గ్రామ పంచాయతీ నీటి పంపులు వంటి జనావాసాల కు దగ్గరగా ఈ రెడీ మిక్స్ ప్లాంట్ ఏర్పాటు విరమించుకోవాలని కోరారు.సంబందిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని, ఇస్తే ఆందోళనలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. అనంతరం యంపిడిఓ కి వినతి పత్రం అందజేశారు.సిపిఎం మండల నాయకులు నెలికంటి నర్సింహా, పంది నరేష్, గ్రామ శాఖ పార్టీ నాయకులు నాతి వెంకట్రామయ్య, అరూరి శంభయ్య,ఆడపు రమేష్,అరూరి ప్రణీత్,గోలి సాయి కిరణ్, సుర్కంటి పాపిరెడ్డి, నర్సిరెడ్డి, మేడి మనోజ్,మంకాల



యాదయ్య,అరూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన

- అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఘనంగా ఓపెన్ హౌస్
- ఆధునిక పోలీస్ వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన
- ఎస్పీ డి.జానకి..





**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ కవాతు మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

**పోలీస్ విభాగాల పనితీరుపై ప్రత్యక్ష ప్రదర్శన...**

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్, బాంబ్ డిస్పోజల్ (బీడీ) టీమ్, డాగ్ స్క్వాడ్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), పోలీస్ కళాబృందం, కమ్యూనికేషన్ విభాగం, ఫింగర్‌ప్రింట్ యూనిట్, క్లూస్ టీమ్, సైబర్ క్రైమ్/డీ4సీ, స్పీడ్ గన్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, డయల్ 112, పీసీఆర్ విభాగాలకు సంబంధించిన పరికరాలు, వాహనాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు.

నేరస్థలాల్లో ఆధారాల సేకరణ, వేలిముద్రల ఆధారంగా నేర పరిశోధన, బాంబు బెదిరింపుల సమయంలో తీసుకునే చర్యలు, నేరాల గుర్తింపులో డాగ్ స్క్వాడ్ పాత్ర, సైబర్ నేరాల నియంత్రణ వంటి అంశాలను సంబంధిత అధికారులు విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. ఆధునిక పోలీస్ పరికరాలు, వాహనాలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి అధికారులను ప్రశ్నలడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



**సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన..**

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మహిళలు, చిన్నారుల భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఆన్‌లైన్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, గుర్తుతెలియని లింకులను తెరవడం, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

**అమరవీరుల సేవాభావం యువతకు ఆదర్శం...**

ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ.. పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి అంకితభావం, సేవానిరతిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల కృషితో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, ఇతర ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, నేరాల నియంత్రణతో పాటు యువతలో చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# మహర్షి వాల్మీకి ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

- మంచి ఆలోచన, ఆత్మపరిశీలనతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యం..
- జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్





**మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన రచించిన రామాయణ మహాకావ్యం తరతరాలకు ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను బోధిస్తోందని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అన్నారు. మంచి ఆలోచనలు, ఆత్మపరిశీలనతో మనిషి తన జీవితంలో గొప్ప మార్పును సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో ఎస్పీ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పురాణ కథనాల ప్రకారం రత్నాకరుడిగా ఉన్న సమయంలో దారి దోపిడీలకు పాల్పడిన వాల్మీకి, సప్తర్షుల బోధనలతో తన జీవితాన్ని విశ్లేషించుకుని సన్మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. నిరంతర తపస్సు, సాధనతో మహర్షిగా ఎదిగి, రామాయణ మహాకావ్యాన్ని రచించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని వివరించారు. గతంలో చేసిన తప్పులను గుర్తించి, వాటిని సరిదిద్దుకుంటూ మంచి మార్గంలో నడవాలని సంకల్పిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని మహర్షి వాల్మీకి జీవితం చాటిచెబుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన, క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని సూచించారు. మహర్షి వాల్మీకి బోధనలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రాసంగికమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో సత్ప్రవర్తన, మానవతా విలువలను పెంపొందించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. మంచి సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న

# మనీషకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత

- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి...

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హన్వాడ గ్రామానికి చెందిన బత్తుల మనీషకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. సోమవారం మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఈ ఎల్‌వోసీని అందించారు. హన్వాడ గ్రామానికి చెందిన బత్తుల మనీష (తండ్రి మల్లప్ప) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందించి, వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రూ. 2,50,000 విలువైన ఎల్‌వోసీ మంజూరైంది. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందడం కష్టంగా ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందే సాయం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచి, మెరుగైన వైద్య సేవలు పొందేందుకు సహకరించడం ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని సకాలంలో స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనీష కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. మహేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నయ్య, హన్వాడ గ్రామ సర్పంచ్ ఇస్నాతి సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య)**

కూనము వెంకటేష్ మృతి చెందారనే విషయం తెలుసుకున్న గన్యాగుల గ్రామ సర్పంచ్ కందూరి కృష్ణయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురవేంటి రాజు, బీఆర్‌ఎస్ మండల నాయకులు కొండకింది మాధవరెడ్డి, వార్డు సభ్యులు రామస్వామి, పోలుమూరి కురుమయ్య, వంజ బాలురెడ్డి, పోతుల శ్రీనివాస్ రెడ్డి, పెద్ద పులి లక్ష్మయ్య, ఎదుల భరత్ కుమార్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేకేఎచ్ టీమ్ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.





# మహబూబ్‌నగర్

# కౌకుంట్లకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు..

- రూ.11.92 కోట్ల నిధులతో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ..
- దేవరకద్ర నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మరో ముందడుగు..


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
SCHOOL EDUCATION (Prog.II) DEPARTMENT
O R D E R :
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
Dr. YOGITA RANA
SECRETARY TO GOVERNMENT
(FORWARDED BY ORDER)
SECTION OFFICER


ANNEXURE [illegible]
Dr. YOGITA RANA
SECRETARY TO GOVERNMENT
(FORWARDED BY ORDER)
SECTION OFFICER

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):**

దేవరకద్ర నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కౌకుంట్ల మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాఠశాల ఏర్పాటుకు రూ. 11 కోట్ల 92 లక్షల నిధులు కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) చొరవతో నియోజకవర్గంలో విద్యా సదుపాయాల విస్తరణకు మార్గం సుగమమైందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

**గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య..**

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తొలిదశలో పైలట్ ప్రాజెక్టు కింద 20 పాఠశాలలను ఏర్పాటు చేయాలనే నిర్ణయంలో భాగంగా కౌకుంట్లకు పాఠశాల మంజూరైంది. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను స్థానికంగా పొందేందుకు అవకాశం కలగనుంది.

**రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్...**

దేవరకద్ర నియోజకవర్గంలో విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇప్పటికే పలు చర్యలు చేపట్టారు. దామగ్నాపూర్ గ్రామంలో సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆధునిక విద్యా సదుపాయాలతో గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అలాగే చిన్నచింతకుంట మండలం పల్లమరి గ్రామం వద్ద రూ. 43 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది.

**డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుతో విద్యార్థులకు ఊరట..**

నియోజకవర్గ విద్యార్థులు ఇంటర్మీడియట్, డిగ్రీ విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంట మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే జీఎంఆర్ చొరవ తీసుకున్నారు. ఈ విద్యాసంస్థల ద్వారా స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు మెరుగుపడనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే జీఎంఆర్, నియోజకవర్గంలో విద్యా సదుపాయాల విస్తరణపై దృష్టి సారిస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఏటీసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటు వంటి చర్యలు దేవరకద్ర నియోజకవర్గ విద్యారంగ అభివృద్ధికి దోహదపడనున్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉన్నత విద్యా అవకాశాలు స్థానికంగానే అందుబాటులోకి వస్తే వారి భవిష్యత్తుకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

# వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 26 (వార్త వేదిక సూర్య):**

వాల్మీకి మహర్షి సమాజంలో ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిపాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహాని కి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి గారు మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం భారతీయ సమాజానికి ధర్మం, సత్యం, న్యాయం, త్యాగం, కర్తవ్యం, మానవీయ విలువలను బోధించే మహోన్నత ఇతిహాసమని తెలిపారు. సీతారాముల ఆదర్శ జీవనం, శ్రీరాముని ధర్మనిష్ఠ, లక్ష్మణుని సోదరప్రేమ, హనుమంతుని భక్తి వంటి విలువలు నేటి తరానికి కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 158 మంగళవారం అక్టోబర్ 27, 2026



# పెద్దపల్లి

## సర్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి
- పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలి
- భౌతిక, ఆన్‌లైన్ రికార్డులు, ఆధారాలను భద్రంగా నిర్వహించాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్-26:
( వార్త వేదిక సూర్య )

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సార్ ) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు తో కలిసి సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎదైన సమాచారం అడిగిన వెంటనే వివరాలు అందించే ందుకు అవసరమైన రికార్డులు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్లను చేర్చడానికి లేదా తొలగించడానికి సంబంధించి తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను తప్పనిసరిగా భద్రపరచాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దాదాపు ముగింపు దశకు





చేరుకున్న నేపథ్యంలో, మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పెండింగ్ పనులను రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో, ఈ వారం చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్ఐఆర్ నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, తగిన డాక్యుమెంట్లు, ఆధారాలను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తుల ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అనర్హతకు సంబంధించిన ఆధారాలను రాజకీయ పార్టీలు, ఆర్‌టీఐ దరఖాస్తుదారులు లేదా ఇతరులు కోరినప్పుడు అందించేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఫారం-6 , 7 అండ్ 8 దరఖాస్తుల పరిశీలనతో పాటు పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీ నాటికి పరిష్కరించాలని సూచించారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన అవసరమైన పత్రాలు, ఆధారాలను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈ.ఆర్.ఓ., బి.ఎల్.ఓ. స్థాయిల్లో అన్ని రికార్డులు, డాక్యుమెంట్లను భౌతికంగా, ఆన్‌లైన్‌లో భద్రంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు సక్రమంగా నమోదయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపునకు సంబంధించి నిబంధనల ప్రకారం తగిన ఆధారాలు ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, ఆర్.డి.ఓ.లు గంగయ్య , సురేష్, ఈ సెక్షన్ సూపర్డెంట్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, అక్టోబర్ 26, (వార్త వేదిక సూర్య):

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ బి. శ్రీరాముల తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామం సర్పంచ్ గోగు రాజయ్య సర్వే నెంబర్ 390 మట్టి తవ్వకాలు రవణాకు సంబంధించి అనుమతులు లీజు పరిమితి అంశాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు సమర్పించగా ఏడి మైన్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన గుర్రం రామస్వామి సర్వేనెంబర్ 83,83/ సి1, 83/సి3 లో తనకు వ్యవసాయ భూమి ఎకరం 35 గుంటలు ఉందని, తనకు పాస్ పుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ శ్రీరాంపూర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం చిన్న బొంకూరు గ్రామానికి చెందిన చింతల చుక్కమ్మ తన పేరు మీద ఉన్న ఇంట్లోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని దొంగ పట్టా చేయించుకోవడానికి చూస్తున్న గుజ్జుల నారాయణరెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ సుల్తానాబాద్ కు. రాస్తూ విచారించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన మామిడి రామ్ కి గృహ జ్యోతి పథకం తన కుటుంబానికి మంజూరు చేయాలని కోరుతూ



దరఖాస్తు చేసుకోగా శ్రీరాంపూర్ ఎంపీడీవో కు రాస్తూ పరిశీలించి అర్హత ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్ సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల రక్షణపై న్యాయ అవగాహన సదస్సు

- బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాలు

మంథని, అక్టోబర్ -26,
(వార్త వేదిక సూర్య):

బాలల రక్షణ, వారి హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంథనిలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పెద్దపల్లి చైర్మన్ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పాన్ ఇండియా పాఠశాల అవగాహన ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు మంథనిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (కో-ఎడ్యుకేషన్) ప్రాంగణంలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం--2012 (పోక్సో చట్టం) పై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. బాలలపై లైంగిక వేధింపులను అరికట్టడం, బాధిత బాలలకు న్యాయం అందించడం, బాలల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మండల న్యాయ సేవాధికార కమిటీ పేర్కొంది. ఈ కార్యక్రమానికి మంథని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, న్యాయవాదులు, పోలీసు అధికా రులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను ఆహ్వానించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కోరారు.




## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, అక్టోబర్ -26,(వార్త వేదిక సూర్య):

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఆదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి పాల్గొన్నారు. శ్రీ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని కలెక్టర్



పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణం తో ముడిపడి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ , బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లను సత్కరించిన ఇనుముల



మంథని, అక్టోబర్ -26, (వార్త వేదిక సూర్య):

మంథని మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ లుగా ఎన్నికయి 8నెలలు గడుస్తున్న సందర్భంగా మొన్నటి బతుకమ్మ పండుగ మరియు దసరా పండుగ వేడుకలను విజయవంతంగా నిర్వహించి పలువురి మన్ననలు పొందిన మంథని మున్సిపల్ పాలకవర్గానికి శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలుపడం జరిగింది. సోమవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ వొడ్నాల శ్రీనివాస్ , వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి కి , నా బాల్య మిత్రుడు 13 వ వార్డు కౌన్సిలర్ యెల్లంకి వంశీ,10 వ వార్డు కౌన్సిలర్ పెంటరి రాజుకు అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించి, రాబోయే రోజుల్లో మంథని మున్సిపాలిటీ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళ్లి, పరిశుభ్రత, ఎచ్చదనం, పట్టణ సుందరీకరణ చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో పాటు శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దేవాలయం డైరెక్టర్ వేల్పుల సామ్రాట్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులు అందజేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ



మంథని,అక్టోబర్ -26, (వార్త వేదిక సూర్య):

మంథని నియోజకవర్గంలోని కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.

విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ విద్యార్థులతో ముచ్చటించి, వారు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం, విద్యా రంగ అభివృద్ధికి తోడ్పడటం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

## బాణాసంచా విక్రయాలకు నవంబర్ 2లోపు దరఖాస్తు చేసుకోండి

- దీపావళి తాత్కాలిక దుకాణాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి
- అవసరమైన ధ్రువపత్రాలతో డీసీపీ కార్యాలయంలో దరఖాస్తు
- ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించాలి
- అనుమతులు లేకుండా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

వరంగల్, అక్టోబర్ 26 (వార్తా వేదిక సూర్య):



రానున్న దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునే వారు నవంబర్ 2వ తేదీలోపు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. పూర్తి వివరాలతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసిన దరఖాస్తులను సంబంధిత డీసీపీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. పండుగ సమయంలో బాణాసంచా విక్రయాలు నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అనుమతుల ప్రక్రియను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గడువులోగా పత్రాలను సమర్పించి అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. దుకాణం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించి స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి నుంచి పొందిన అనుమతి పత్రాన్ని జతచేయాలని సూచించారు. వస్తు, సేవల పన్ను నమోదు ధ్రువపత్రంతో పాటు గతంలో బాణాసంచా విక్రయాలకు అనుమతి పొందిన వారు పాత లైసెన్సు ప్రతిని కూడా సమర్పించాలని పేర్కొన్నారు. అవసరమైన చోట్ల పక్క స్థలాల యజమానుల అనుమతి పత్రాలను జతచేయడంతో పాటు దుకాణం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన నమూనా చిత్రపటాన్ని కూడా అందించాలని తెలిపారు. తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలకు అనుమతి కోరే వారు ప్రభుత్వ ఖజానాకు నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ వెల్లడించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదాలత్ శాఖలో రూ.800 చెల్లించినట్లు ధ్రువీకరించే బ్యాంకు చలాన్‌ను దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులో పేర్కొన్న వివరాలు, జతచేసిన ధ్రువపత్రాలు పూర్తిగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అవసరమైన పత్రాలు లేకుండా దరఖాస్తులు సమర్పించకుండా, ముందుగానే అన్ని వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా అనుమతులు జారీ చేస్తారని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు ముందుగా అనుమతులు పొందడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు నిర్ణీత గడువును దృష్టిలో ఉంచుకుని అనుమతుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయాలు నిర్ణీత నిబంధనలకు అనుగుణంగా జరిగేలా పోలీసు శాఖ చర్యలు చేపడుతోందని తెలిపారు. అనుమతులు పొందిన అనంతరమే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అవసరమైన ధ్రువపత్రాలతో నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డీసీపీ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు.

# ఆదర్శ కాలనీ బస్తీ దవాఖానలో
# టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం
## 200 మందికి వైద్య పరీక్షలు.. అవసరమైన వారికి మందుల పంపిణీ





రాజేంద్రనగర్, అక్టోంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) : క్షయవ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీ బస్తీ దవాఖానలో సోమవారం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా రోగ నిర్ధారణలో భాగంగా ఎక్స్‌రే పరీక్షలు కూడా చేపట్టారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్ర దించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బస్తీ దవాఖానల ద్వారా ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు, క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, అవసరమైన మందులు అందించడం వంటి చర్యలు ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా నిలుస్తున్నాయి. ఈ తరహా వైద్య కార్యక్రమాల ద్వారా వ్యాధులపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షోయిల్, సూపర్‌వైజర్ రహీం, నరేష్, మధుబాబు, డీపీఎస్ శ్రీను, ఎస్ఎన్ జ్యోతి, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు తిరుపతమ్మ, లక్ష్మి, సరస్వతి, పద్మ, ఇంద్రజ, సత్తెమ్మతో పాటు గాజుల నరేష్ యాదవ్, పవన్ గుప్తా, శేఖర్, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.





## కాటేదాన్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి. వేణు ముదిరాజ్ నియామకం

### యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: డి.వేణు ముదిరాజ్

రాజేంద్రనగర్, అక్టోంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) : కాటేదాన్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి. వేణు ముదిరాజ్ నూతనంగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జె. మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డి. వేణు ముదిరాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కాటేదాన్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువత సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, యువతను ఏకం చేస్తూ యూత్ కాంగ్రెస్‌ను కాటేదాన్ డివిజన్‌లో మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, యువతకు అండగా నిలుస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్రనగర్, అక్టోంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) : రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో పట్టణ సమాజ అభివృద్ధి కార్యకలాపాలపై జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు రుణ అనుసంధానం, ఆదర్శ మార్కెట్ల అభివృద్ధి, వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక విక్రయ ప్రాంతాల ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంఘాల ద్వారా మహిళలకు ఆర్థికంగా చేయూత అందించేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన సంఘాలకు బ్యాంకు రుణాలు అందేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే వీధి వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక విక్రయ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో వ్యాపారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, అర్హులైన వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందించి వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆదర్శ మార్కెట్ల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, పట్టణ సమాజ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పట్టణ సమాజ అభివృద్ధి విభాగానికి చెందిన ప్రాజెక్టు అధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో రక్తదానం

### పోలీసు అమరవీరుల సంస్మరణార్థం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులు, సిబ్బంది



మోటకొండూరు, అక్టోబర్ 26(వార్త వేధిక సూర్య ): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భువనగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ మరియు పోలీస్ సిబ్బంది, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఆర్. ప్రదీప్ కుమార్, వై. సంతోష్ రెడ్డి, మహమ్మద్ జలీల్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరితో పాటు మోటకొండూరు ప్రాంతానికి చెందిన యువకులు కడపర్తి మణిదీప్, ఎత్తరి సాయి దిలీప్, జంపాల నితిన్, జక్క కరుణాకర్ రెడ్డి, పన్నాల నవీన్ రెడ్డి, దేవరకొండ రవి మరియు అలిమినేటి సిద్ధారెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రాణాలను కాపాడే రక్తదాన కార్యక్రమంలో పోలీసులు, యువకులు భాగస్వాములు కావడం పట్ల పలువురు వారిని అభినందించారు.

## మోటకొండూరు ఎస్సీ బాలుర వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

### సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు డిమాండ్



మోటకొండూరు, అక్టోబర్ 26(వార్త వేధిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు హాస్టల్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తెస్తూ పలు డిమాండ్లు చేశారు.హాస్టల్‌లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నప్పటికీ నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రివేళల్లో పాములు సంచరిస్తూ తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆంజనేయులు తెలిపా రు. తక్షణమే ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్ మరియు పర్మినెంట్ వంట మనిషి (కుక్) పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కుక్ లేకపోవడంతో హాస్టల్ కార్మికులే వంట చేస్తూ వంద మంది పిల్లలకు వడ్డిస్తున్నారని, వాష్‌రూమ్‌ల శుభ్రతకు స్కావెంజర్‌ను నియమించాలని కోరారు. గత 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కేవలం రూ. 11 వేల తక్కువ వేతనమే ఇస్తున్నారని, ఎలాంటి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ. 30 వేలకు పెంచి అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గత 10 నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఒకే వ్యక్తి నైట్ వాచ్‌మెన్ డ్యూటీ చేస్తూ, వంద మందికి వంట వండుతూ, రూములు శుభ్రం చేయడం వల్ల తీవ్ర పనిభారం పడుతోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సర్వే కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వడ్డేబోయిన మహేందర్, హాస్టల్ కార్మికులు వద్దిగళ్ళ బిక్షపతి, వెంకటయ్య, మామిడికాయల సోమక్క, బొట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి



## యువ సంఘుసంస్కర్త అవార్డు అందుకున్న కుసుమ స్నేహ

### ఏం ఎన్ స్ ఫౌండర్స్ డాక్టర్ బైరి నరేష్, గాండ్ల సుజాత టీచర్ చేతుల మీదుగా ప్రధానం

రంగారెడ్డి /వార్త వేదిక సూర్య: సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద భావాలను పెంపొందించే లక్ష్యంతో 'మూఢనమ్మకాల నిర్మూలన సంఘం' (ఏం ఎన్ ఎస్)ఆధ్వర్యంలో తమిళనాడులోని చెన్నై నగరంలో ఉన్న ప్రసిద్ధ 'పెరియార్ తిడల్' వేదికగా అక్టోబరు 17, 18, 19 తేదీలలో మూడు రోజుల పాటు జాతీయ మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. ఏం ఎన్ ఎస్ వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు డాక్టర్ బైరి నరేష్ మరియు జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత నేతృత్వంలో ఈ మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి.దేశవ్యాప్తంగా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సంఘం కోసం, సమాజ హితం కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలు మరియు నాయకులను ఈ మహాసభల వేదికగా అభినందిస్తూ ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. ఈ క్రమంలోనే సమాజ మార్పు కోసం, హేతువాద భావాల ప్రచారానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి, ఏం ఎన్ ఎస్ యూత్ కమిటి కి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా ఉన్న రంగారెడ్డి జిల్లా, రాజేందర్ నగర్ మండలం, మైలార్‌దేవపల్లి గ్రామానికి చెందిన కుసుమ స్నేహ తండ్రి వెంకటేశ్వర్లు కి జాతీయ నాయకత్వం యువ సంఘసంస్కర్త' అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కుసుమ స్నేహ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మూఢనమ్మకాల నిర్మూలన కోసం, శాస్త్రీయ సమాజ స్థాపన కోసం తన వంతు కృషిని మరింత ఉధృతం చేస్తానని తెలిపారు. మహాసభలు విజయవంతంగా ముగియడంతో ప్రతినిధులంతా హేతువాద స్ఫూర్తితో స్వస్థలాలకు పయనమయ్యారు.

## కళాకారుల ఐక్యతే మన బలం

### తెలంగాణ వేడుకలను విజయవంతం చేయాలి

### జిన్నారం మండల జానపద కళాకారుడు మల్లేష్

### నవంబర్ 3న సిరిసిల్లలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



సంగారెడ్డి,వార్త వేదిక సూర్య, అక్టోబర్ 26: తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ, తెలంగాణ ఫోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 3న సిరిసిల్ల పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారధి, జిన్నారం మండల జానపద కళాకారుడు మల్లేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి కళాకారుడు భాగస్వామై తన వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సోమవారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మల్లేష్ మాట్లాడుతూ.. కళాకారుల ఐక్యతే మన బలమని, ఐకమత్యంతోనే హక్కులను సాధించుకోగలమని అన్నారు. కళాకారుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనతో పాటు భవిష్యత్ తరాల కళాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు అందరూ సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. సిరిసిల్లలో నిర్వహించనున్న వేడుకలు ఎవరో కొందరికి సంబంధించిన కార్యక్రమం కాదని, ప్రతి కళాకారుడి కార్యక్రమమని పేర్కొన్నారు. కార్యక్రమ విజయానికి ప్రచారాన్ని విస్తృతం చేయడంతో పాటు కళాకారులందరూ చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎవరో ముందుకు వస్తారని ఎదురుచూడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కళాకారుల గొంతుకు గుర్తింపు రావాలన్నా, వారి జీవితాల్లో సానుకూల మార్పులు చోటుచేసుకోవాలన్నా ఐక్యత ఎంతో అవసరమని మల్లేష్ అన్నారు. మన కళ కోసం, మన హక్కుల కోసం, కళాకారుల భవిష్యత్తు కోసం అందరూ ఏకమై నవంబర్ 3న సిరిసిల్లలో తమ ఐక్యతను చాటాలని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ, తెలంగాణ ఫోక్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ తరఫున విజ్ఞప్తి చేశారు.

## నాంచారిపేటలో డ్రగ్స్ వ్యతిరేకత, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

### పాల్గొన్న ఎస్సై కుమారస్వామి యాదవ్



మోటకొండూర్, అక్టోబర్ 26(వార్త వేధిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల పరిధిలోని నాంచారిపేట గ్రామంలో యువకులు, ప్రజల కోసం డ్రగ్స్ (మత్తు పదార్థాలు) వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామీణులకు, యువతకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. నేటి యువత చెడు వ్యసనాలకు, ముఖ్యంగా డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై హితవు పలికారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు ఎంత ముఖ్యమో వివరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, యువత మంచి భవిష్యత్తు రూపుదిద్దుకోవడానికి ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2 సంచిక : 158
మంగళవారం 27 అక్టోబర్, 2026
TEUSDAY 27 OCTOBER 2026



# రంగారెడ్డి

# పట్టభద్రుల ఓటరు నమోదే తొలి అడుగు

## అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి.. గతంలో ఓటు వేసినవారు సైతం మళ్లీ దరఖాస్తు చేయాలి

## కొలన్ సుభాష్ రెడ్డి



రాజేంద్రనగర్, అక్టోంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) : మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి సూచనల మేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో అత్తాపూర్, హైదర్‌గూడ డివిజన్లలో అధ్యక్షులు వనం శ్రీరామ్ రెడ్డి, నరేంద్ర రావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులకు ఫారం--18 అందజేశారు. ఈ సందర్భంగా కొలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరూ ఫారం--18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు వేసినవారు సైతం తాజా ఓటరు నమోదు ప్రక్రియలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తమకు తెలిసిన పట్టభద్రులకు ఈ సమాచారాన్ని చేరవేసి, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు సాధారణ ఎన్నికలతో పోలిస్తే ప్రత్యేకమైనవని, విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, యువత తమ రాజకీయ అవగాహనతో తీర్పునిచ్చే ఎన్నికలని సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. విద్యావంతుల ఆలోచనా విధానం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వారి అభిప్రాయాలు ఈ ఎన్నికల్లో ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందనను అంచనా వేయడానికి కూడా ఈ ఎన్నికలు కీలకంగా నిలుస్తాయని అన్నారు. గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ, విద్యావంతుల ఆలోచనా విధానానికి ప్రాధాన్యం ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే స్థాయికి చేరుకున్నాయని వివరించారు. కొత్తగా పట్టభద్రులైన అర్హులను గుర్తించి, వారిలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటరు నమోదు చేయించడంతోనే బాధ్యత పూర్తికాదని, ముసాయిదా ఓటరు జాబితాలో సంబంధిత వ్యక్తి పేరు నమోదైందో లేదో కూడా నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేకపోతే నిబంధనల ప్రకారం సంబంధిత దరఖాస్తు లేదా అభ్యంతరం సమర్పించి, పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో యువతకు ఆశించిన స్థాయిలో అవకాశాలు లభించడం లేదని సుభాష్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఉద్యోగాలు, అభివృద్ధి, సాగునీరు, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, ముఖ్యంగా యువత భవిష్యత్తుపై ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో, పూర్తి ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికలను అత్యంత బాధ్యతతో తీసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జె. చిత్తారి, ముఖేష్ భంగి శ్రీను, మల్లేష్, నాలింగ్, అజయ్, రాము యాదవ్, ఎం. ప్రీతం కుమార్, పి. నరేందర్ రెడ్డి, రవి, ఎస్. అమరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కె. హరినాథ్, కొలన్ మదన్ పాల్ రెడ్డి, ఎ. కృష్ణారావు, శ్రీవర్ధన్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### సౌదీలో చిక్కుకున్న తెలుగు ఉమ్రా యాత్రికులను

## తక్షణమే స్వదేశానికి రప్పించాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అజహరుద్దీన్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మెకానిక్ బాబా విజ్ఞప్తి

రాజేంద్రనగర్, అక్టోంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) : సౌదీ అరేబియాలో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల ఉమ్రా యాత్రికులను తక్షణమే స్వదేశానికి రప్పించి, వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని కేవీఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజహరుద్దీన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పందించి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మెకానిక్ బాబా మాట్లాడుతూ, విమానాల సాంకేతిక సమస్యలు, వాతావరణ పరిస్థితుల కారణంగా సుమారు 4 వేల మంది భారతీయ ఉమ్రా యాత్రికులు జెద్దా, మదీనా విమానాశ్రయాల పరిసరాల్లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీరిలో హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి ప్రాంతాలకు చెందిన తెలంగాణ యాత్రికులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. విమానాల రద్దు, ఆలస్యంతో యాత్రికులు హోటళ్లలోనే ఉండిపోవాల్సి వస్తోందని, చేతిలో డబ్బులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్ బస గడువు ముగియడం, వీసా గడువు దగ్గరపడుతుండటంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. స్వదేశంలో ఉన్న వారి కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి : ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అజహరుద్దీన్ వెంటనే స్పందించాలని మెకానిక్ బాబా కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సహాయం అందేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సౌదీలోని భారత రాయబార కార్యాలయం ద్వారా యాత్రికులకు తక్షణ సహాయం అందించాలని, కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైతే ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కోరారు. వీసా గడువు ముగియకుండా పొడిగించేలా చర్యలు తీసుకోవడంతోపాటు, తెలంగాణ భవన్, హజ్ హౌస్‌లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లి విదేశంలో ఇబ్బందులు పడుతున్న యాత్రికులను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు తక్షణ చర్యలు చేపడుతుందని ఆశిస్తున్నట్లు మెకానిక్ బాబా తెలిపారు.

### నీటి వృథాను అరికట్టలేని అధికారులు..

## ప్రజలకు నీటి పొదుపుపై నీతులా?

### మణికొండలో పైపుల లీకేజీపై అందె లక్ష్మణ్ రావు ఆగ్రహం



